RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 349 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 జనవరి 2025 గురువారం పేజీలు : 4

## ఎక్కడ దాక్కున్నా పట్టిచ్చే 'భారత్ పోల్'

న్యూఢిల్లీ : మనదేశంలోని దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి కీలకంగా దోహదపడే 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఇక్కడ ఆవిష్కరిం చారు. కేసుల విషయంలో అంతర్జాతీయంగా పనిచేస్తున్న మన దర్యాప్తు సంస్థల పనిని ఈ పోర్టల్ సులభతరం చేస్తుందని, ఇంటర్ పోల్ సహకారం వేగంగా అందుకోగలుగుతామని ఆయన అన్నా రు. 'భారత్ పోల్'ను సీబీఐ రూపొందించింది. "అంతర్జాతీయ పోలీసుల సహకారం ఇప్పటిదాకా సీబీఐ మాత్రమే తీసుకుంటోం ది. 'భారత్ పోల్' రాకతో మన దేశానికి చెందిన అన్నీ దర్యాప్తు సంస్థలూ, చివరకు రాష్ట్ర పోలీసు విభాగాలు సైతం ఇంటర్‌పోల్ సాయం తీసుకొనగలుగుతాయి. అంతర్జాతీయంగా మనదేశం చేపట్టే విచారణ ప్రక్రియను కొత్త శకంలోకి ఇది నడిపిస్తుంది. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయం, సంబంధాల్లో తలెత్తుతున్న సమస్యలు తొలగించి..నేరగాళ్ల కట్టడికి బాగా పనిచేస్తుంది" అని అమిత్‌షా అన్నారు.




## కేసీఆర్ రంగంలోకి దిగే సమయం వచ్చేసిందా..?

## కారు స్టీరింగ్‌ను తీసుకునే చేతులేవి..?

హైదరాబాద్ : ఫార్ములా ఈ-రేసు కేసులో దారులన్నీ మూసుకుపోతున్న పరిస్థితి. కేటీఆర్ అరెస్ట్ ఖాయమని.. బీఆర్ఎస్ శ్రేణులు కూడా ఓ అంచనాకు వచ్చినట్లు కనిపిస్తున్నాయ్. ఇదే ఇప్పుడు గులాబీ శ్రేణులకు కొత్త టెన్షన్ పుట్టిస్తోంది. కేటీఆర్ అరెస్ట్ అయితే అనే ఆలోచనే.. వారికి నిద్రలేకుండా చేస్తోంది. అన్నీ తానై, అన్నింటికి తానై కారును ముందుకు నడిపిస్తున కేటీఆర్ అరెస్ట్ అయితే.. పార్టీ వ్యవహారాలు చూసుకునేది ఎవరు.. స్థానిక సంస్థల ఎన్నికల ముందు జరుగుతున్న ఈ పరిణామాలు.. పార్టీలో మిగిల్చిన చర్చ ఏంటి.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టార్గెట్‌గా పావులు కదులుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. వివాదం ఏదైనా కేటీఆర్ పేరే ప్రధానంగా వినిపిస్తున్నట్లు కనిపిస్తోంది సీన్. దాదాపు ఆరుసార్లు కేటీఆర్‌ను టార్గెట్ చేసుకొని.. సర్కార్ పావులు కదిపిందనే ప్రచారం జరుగుతోంది కూడా ! గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సమీక్షిస్తూ.. ప్రభుత్వం విచారణ కమిటీలు వేసింది. దీంతో సరికొత్త అంశాలు.. రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయ్.

**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రచ్చ...** మొదట్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాజకీయాల్లో రేపిన రచ్చ అంతా ఇంతా కాదు. ఈ వ్యవహారంలో కేటీఆర్ సూత్రధారిగానే అధికారులు పనిచేశారనే ప్రచారం జరిగింది. కేటీఆర్‌ను ఈ కేసులో కావాలని ఇరికిస్తున్నారని.. ఓ దశలో గులాబీ శ్రేణులు ఘాటుగా రియాక్ట్ అయ్యాయ్.

ఆ తర్వాత లగచర్ల ఘటన.. రాష్ట్ర రాజకీయాల్లోనే కొత్త చర్చకు దారి తీసింది. సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో.. భూసేకరణ విషయంలో గిరిజన రైతులు అధికారులపై దాడి వెనక కేటీఆర్ కుట్ర ఉందనే అభియోగాన్ని.. పోలీసులు మోపే యత్నం చేశారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

**రాజకీయాన్ని షేక్ చేసిన ఫామ్‌హౌస్ పార్టీ వ్యవహారం...** ఫోన్‌ట్యాపింగ్, లగచర్ల ఘటన తర్వాత.. తెలంగాణ రాజకీయాన్ని ఫామ్‌హౌస్ పార్టీ వ్యవహారం షేక్ చేసింది. కేటీఆర్ బావమరిది రాజ పాకాల నివాసంలో.. డ్రగ్స్ పార్టీ జరుగుతుందని దాడులు చేసిన పోలీసులు.. ఆ కేసులో కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నం చేశారని.. బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఫార్ములా ఈ-కార్ రేస్ వ్యవహారం వివాదం పీక్స్‌కు చేరింది. దాదాపు నాలుగు నెలలుగా రాష్ట్ర రాజకీయాల్లో ఇది చర్చకు దారితీస్తోంది. ఈ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గులాబీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఇప్పుడు ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఏసీబీ వాదనతోనే న్యాయస్థానం ఏకీభవించినట్లు కనిపిస్తోంది. ఏసీబీతో పాటు ఈడీ కూడా నోటీసులు ఇవ్వడంతో.. ఈసారి కేటీఆర్ అరెస్ట్ ఖాయం అనే ప్రచారం ఊపందుకుంది. పార్టీలో ఇదే ఇప్పుడు కొత్త టెన్షన్‌కు కారణం అవుతోంది. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే.. బీఆర్ఎస్‌ను ఎవరు ముందుకు నడిపిస్తారనేది చర్చకు దారి తీస్తోంది.

**కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాకపోయినా...** 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత.. లోక్‌సభ ఎన్నికల సమయంలో తప్పిస్తే.. కేసీఆర్ పెద్దగా బయట కనిపించలేదు. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయడం నుంచి.. పార్టీని నడిపించడం వరకు.. అన్ని విషయాల్లోనూ కేటీఆర్ ముందు కనిపిస్తున్నారు. ఒకరకంగా ఆయనే అన్ని బాధ్యతలు తీసుకున్నారు. ఏడాదికాలంగా కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాకపోయినా%ా%. నేతలకు పెద్దగా అందుబాటులో లేకపోయినా.. ఆ లోటు ఎక్కడా కనిపించకుండా కేటీఆర్.. అన్ని బాధ్యతలు నెరవేరుస్తున్నారు. పార్టీ నేతలతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ.. అధినేత పాత్ర పోషిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం.. కొన్ని రోజులుగా పార్టీ కేడర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ జైలుకు వెళ్తే.. కారు పార్టీని నడిపించేది ఎవరు.. కారు స్టీరింగ్‌ను తీసుకునే చేతులేవి అంటూ పార్టీ నేతల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది. ఇక అటు ఈ కేసు విషయంలో తగ్గేదే లే అన్నట్లు ఏసీబీ కనిపిస్తోంది. ఇన్నిరోజులు నాట్ టు అరెస్ట్ అని.. కోర్టు ఆర్డర్ అడ్డంకిగా ఉండేది. ఐతే ఇప్పుడు దాన్ని కూడా ఎత్తివేసింది న్యాయస్థానం. దీంతో ఫార్ములా ఈ-రేసు కేసులో ఏసీబీ మరింత దూకుడు చూపించే అవకాశం ఉంటుంది.

**కేసీఆర్ రంగంలోకి దిగే సమయం వచ్చేసిందా..?...** కేటీఆర్‌ను విచారించేందుకు.. ప్రభుత్వం పగడ్బందీగా అడుగులు వేస్తోంది. గవర్నర్ అనుమతి తీసుకోవడంతో పాటు కేసును ఏసీబీకి అప్పగించడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కూడా కేసులో ఎంటర్ అయింది. దీంతో ఒకరకంగా ఈ కేసులో ఉచ్చు బిగుసుకుంటున్నట్లే ! అరెస్ట్ జరిగితే.. పార్టీని నడిపించేది ఎవరు అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. కేసీఆర్ రంగంలోకి దిగే సమయం, సందర్భం ఆసన్నమైందని కొందరు అంటుంటే.. నాయకత్వం విషయంలో మరికొందరు పేర్లు తెరమీదకు వస్తున్నాయ్. ఐతే ఏం జరుగుతుందనేది మాత్రం జనవరి 9 తర్వాతే క్లారిటీ వచ్చే అవకాశం ఉంటుంది. ఏమైనా ఫార్ములా ఈ-రేసు కేసు వ్యవహారం.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరతీయడం ఖాయమంటూ మరికొందరు అంటున్నారు.




హైదరాబాద్: ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా.. అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. గురువారం విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది.

## అవునా... నిజమా..!?

## కలవరపడ్డ భాగ్యనగరం!!




హైదరాబాద్: తెలంగాణలో అది కూడా హైదరాబాద్‌లో 11 HMPV కేసులు నమోదయినట్లు సిటీలోని మణి మైక్రోబయో లాజికల్ ల్యాబొరేటరీ వెల్లడించింది.

అంటే.. 2024 డిసెంబర్‌లోనే (గత నెలలోనే) HMPV వైరస్ తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చేసింది. మణి మైక్రోబయాలాజికల్ ల్యాబొరేటరీలో రకరకాల వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడిన 258 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో.. 205 మందికి ఎగువ శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నట్టు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. అంతేకాదు.. ఈ 205 మందిలో 11 మందికి హెచ్ఎంపీవీ పాజిటివ్ వచ్చినట్లు సదరు ల్యాబొరేటరీ తాజాగా వెల్లడించింది. మణి మైక్రోబయోలజీ అనే పేరుతో హైదరాబాద్‌లో నడుస్తున్న ఒక ప్రైవేట్ ల్యాబొరేటరీ విడుదల చేసిన Respiratory Viral Pneumonia Panel Dataలో 11 HMPV వైరస్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఉంది.

అయితే.. కంగారు పడాల్సిన పనేమీ లేదని, HMPV పాజిటివ్ వచ్చిన 11 మంది కోలుకుని డిశ్చార్జ్ కూడా అయినట్లు సదరు ల్యాబొరేటరీ తెలిపింది. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై ఆందోళన అక్కర్లేదని ఐసీఎంఆర్ ఇప్పటికే తెలిపింది. ఈ వైరస్ పాతదేనని ఇప్పటికే ఇండియాతో సహా ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిలో ఉందని స్పష్టం చేసింది. దేశంలో ఇన్ ఫ్లూయెంజా, తీవ్ర శ్వాసకోశ వ్యాధుల లాంటి కేసులు అసాధారణ రీతిలో ఏమీలేవని పేర్కొంది. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని చెప్పింది. వైరస్?ను ఎదుర్కొనేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్ మన దగ్గర ఉందని పేర్కొంది. చైనాలో వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటా నిమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు మన దేశంలోనూ నమోదవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేశవ్యాప్తంగా ఏడు కేసులు రికార్డయ్యాయి.




## ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాల తర్వాతే!

## ఆశావహుల్లో తీవ్ర నిరాశ!

హైదరాబాద్ : తెలంగాణలో ఇప్పట్లో క్యాబినేట్ విస్తరణ జరిగే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. కొన్ని నెలలుగా విస్తరణపై జోరుగా ఊహాగానాలు వినిపించాయి. పైగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అనధికార అధ్యక్షుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉన్నారు. మరోవైపు ఈ నెల మూడో వారంలో తెలంగాణ లో పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో బిజీగా గడపనున్నారు. ఈ పర్యటనకు ముందుకానీ, తర్వాత కానీ ఆస్ట్రేలియా, సింగపూర్‌లలో సీఎం పర్యటిస్తారు. ఇంకోవైపు సంక్రాంతి పండగ సందర్భంగా పీడ దినాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ క్యాబినేట్ విస్తరణ ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాల తర్వాత ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ క్రమంలోనే అధిష్ఠానంతో చర్చలు జరిగాయి. ఆ తర్వాత ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో జనవరిలో మంత్రివర్గ విస్తరణకు అవకాశాలు తక్కువేనని కాంగ్రెస్ ముఖ్యనేతలు చెబుతున్నారు. లాస్ట్ ఇయర్ జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పదేళ్ల విరామం తర్వాత అధికారంలోకి వచ్చింది. అంతేకాదు కకావికలమైన పార్టీని ఏకతాటిపై తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు అప్పటి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడైన రేవంత్ రెడ్డి. ఎలక్షన్స్ లో విన్నింగ్ తర్వాత సీనియారిటీని పక్కన పెట్టి.. బయట నుంచి వచ్చిన రేవంత్ రెడ్డికే తెలంగాణ ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించింది కాంగ్రెస్ అధిష్ఠానం. అయితే అసెంబ్లీ ఎన్నికలు అయిన వెంటనే లోక్ సభ ఎన్నికలు వచ్చి పడటంతో తెలంగాణలో మంత్రివర్గం విస్తరణ ఆలస్యమైంది. దీంతో పరి పాలన కంటే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ సీట్లు గెలవడంపైనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించడం జరిగింది . ఈ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 8 లోక్ సభ సీట్లను గెలుచుకుంది. అటు భారతీయ జనతా పార్టీ కూడా 8 సీట్లు గెలుచుకొని సమఉజ్జీగా నిలిచింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీజేపీకి పక్కలో బల్లంగా మారింది. మరోవైపు బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షంగా చుక్కలు చూపిస్తోంది. అయితే రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్, చంద్రబాబు మాదిరే పక్క పార్టీల వారినీ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే పనిలో పడ్డారు. కొత్తగా జరిగే క్యాబినేట్ విస్తరణలో మరో ఆరుగురికి మాత్రమే ఛాన్స్ ఉంది. ఇందులో భాగంగా మక్తల్ శాసనసభ్యుడైన వాకిటి శ్రీహరిని మంత్రి వర్గంలో తీసుకునే అవకాశాలున్నాయి. అటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఈ సారి మంత్రివర్గంలో తీసుకుంటారా అనేది చూడాలి. ఆల్రెడీ రెడ్డిలతో పాటు కోమటిరెడ్డి అన్న కూడా మంత్రిగా ఉండటంతో ఈయనక మంత్రి వర్గంలో స్థానం దొరకడం అనుమానమనే చెప్పాలి. అటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ను కూడా మంత్రి పదవి దక్కడం గ్యారంటీ అని చెబుతున్నారు. తెలంగాణలో మొత్తంగా 18 మందికి ముఖ్యమంత్రితో కలిసి క్యాబినేట్ బెర్త్ ఛాన్సెస్ ఉన్నాయి. ఇప్పటికే క్యాబినేట్ లో ముఖ్యమంత్రితో కలిపి దాదాపు 4 రెడ్లకు స్థానం దక్కింది. ఇప్పటికే రేవంత్ తో కలిపితే 12 మంది ఉన్నారు. ఈ సారి విస్తరణలో 4 నలుగురికి ఛాన్స్ ఇచ్చే అవకాశాలున్నాయి. మరో 2 తర్వాత భర్తీ చేస్తారా అనేది చూడాలి. మరోవైపు రేవంత్ రెడ్డి క్యాబినేట్ లో ముస్లిమ్ మైనారిటీ వర్గం నుంచి ఎవరు అమాత్యులుగా లేరు. ఈ సారి మంత్రివర్గంలో మైనారిటీ వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయి. సామాజిక వర్గాలుగా చూసుకుంటే.ఈ సారి మంత్రివర్గంలో మైనారిటీ, ఎస్సీ ల నుంచి మాల, మరో రెడ్డితో పాటు ఒక బీసీలకు దక్కే అవకాశాలు లేకపోలేదు.

# సంపాదకీయం

## పొలిటిక్స్ లో వ్యూహాలకు.. ప్రాక్టికల్స్‌కు...
## తేడా పీకేకు తెలిసిందా?

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరు సంపాదించుకున్న ప్రశాంత్ కిశోర్... ప్రధానంగా ఏపీలో 2019లో వైసీపీ అధికారంలోకి రావడంలో కీలక భూమిక పోషించినట్లు చెబుతుంటారు. అంతక ముందు బీజేపీకి సహకరించారని అంటారు. ఆ విధంగా వ్యూహకర్తగా పీకే సక్సెస్ అయ్యారనే అంటారు. ఈ సమయంలో ఆయన నేరుగా పొలిటీషియన్ గా మారారు. ఇందులో భాగంగా... జన్ సురాజ్ పార్టీని స్థాపించారు. ఇటీవల బీహార్ లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసినా.. చూపించిన ప్రభావం అతి స్వల్పం అనే మాటలు వినిపించాయి. ఇలా పొలిటికల్ ప్రాక్టికల్స్ లో డక్కా మొక్కీలు తింటున్నట్లు కనిపిస్తున్న పీకే తాజాగా పోలీసుల అరెస్టు, వివరం చెప్పకుండా వివిధ ప్రాంతాలకు తిప్పడం వంటి విషయాలను ఎక్స్ పీరియన్స్ చేసినట్లు తెలుస్తోంది. అవును... బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీ.పీ.ఎస్.సీ.) వ్యవహారంలో ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు సోమవారం భగ్నం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఈ సమయంలో ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. అయితే... ఈ షరతులతో కూడిన బెయిల్ ను పీకే తిరస్కరించారు. దీంతో.. ఆయనను సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఈసారి షరతులు లేని బెయిల్ మంజూరు చేసింది. దీంతో.. సోమవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు ప్రశాంత్ కిశోర్. ఈ సందర్భంగా స్పందించిన ప్రశాంత్ కిశోర్... పోలీసులపై సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో భాగంగా... తన దీక్షను భగ్నం చేసిన అనంతరం తనను ఎక్కడికి తీసుకెళ్తున్నారనే విషయం చెప్పలేదని.. ఈ క్రమంలో ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకూ వివిధ ప్రాంతాలకు పోలీసు వాహనంలో కూర్చోబెట్టి తీసుకెళ్లారని అన్నారు. ఇదే సమయంలో.. తనను జైలుకు కూడా తీసుకెళ్లలేదని పీకే సంచలన ఆరోపణలు చేశారు. దీంతో... ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగిన తర్వాత, ప్రధానంగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎదురయ్యే బాధలు, ఇబ్బందులు వాటి నుంచి ఎలా తేరుకుని ప్రజల్లో పేరు సంపాదించుకోవాలి అనే విషయాలపై ఇప్పటివరకూ పలువురు నేతలకు మెలుకువలు చెప్పిన పికేకీ.. తాజాగా ఈ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కూడా లభించినట్లుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. కాగా... ఇటీవల బీ.పీ.ఎస్.సీ నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో.. ఈ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 2న గాంధీ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు ప్రశాంత్ కిశోర్. దీంతో... సోమవారం ఆయన దీక్ష భగ్నం చేశారు పోలీసులు. ఈ క్రమంలో... సుమారు నాలుగు రోజుల పాటు నిరాహర దీక్ష చేయడంతో పాటు సోమవారం పగలంతా పోలీసుల అదుపులోనే ఉండటంతో ఆయన ఆరోగ్యం క్షీణించిందని చెబుతున్నారు. దీంతో.. ఆయనను పాట్నాలోని ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది.

## రైతులు సహకార సంఘం సేవలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి : మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : రైతులు సహకార సంఘం సేవలు ప్రతి రైతు తప్పక సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సుమారు 94.25 లక్షలతో నూతనంగా నిర్మించిన వ్యవసాయదారుల సేవా సహకార సంఘం కార్యాలయాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని బుధవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సహకార సంఘం నూతన భవనం నిర్మాణానికి కృషి చేసిన శామీర్ పేట సహాకార సంఘం ఛైర్మన్ మధుకర్ రెడ్డితో పాటు పాలక వర్గాన్ని అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులకు సహకార సంఘం తో అందే లబ్ధిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఇళ్లు కట్టుకోవాలన్నా, భూములు కొనుకోవాలన్నా, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్నా సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సీడి కిందలోను ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ విషయం రైతులందరికి తెలిసేలా కరపత్రాలను ముద్రించి రైతులకు అందేలా ప్రచారం చేయాలన్నారు. మారుమూల గ్రామంగా ఉన్న మూడుచింతలపల్లి పరిసర గ్రామాలను గత ప్రభుత్వ హాయాంలో సిఎం కేసిఆర్ ప్రత్యేక మండలంగా మార్చి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రత్యేక మండలం కావడంతో మూడుచింతలపల్లి గ్రామాల్లోన్ని భూములకు రెక్కలు వచ్చాయని తెలిపారు. ఇక్కడ కొత్త వ్యవసాయదారుల సేవా సహకార సంఘం భవనం నిర్మించేందుకు మధుకర్ రెడ్డి చాలా శ్రమించారని, నేను మంత్రిగా ఉన్నప్పుడు ఈ భవనానికి నిధులు భారీగా మంజూరు చేయడం జరిగిందని చెప్పారు.

సంఘాన్ని అభివృద్ధి చేసి యువకుడి పనితనం అంటే ఎంటో మధుకర్ రెడ్డి చూపించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, డిసిసిబి ఛైర్మన్ సత్తయ్య, శామీర్ పేట సొసైటీ ఛైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, శామీర్ పేట్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఐలయ్య యాదవ్, తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసిలు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




తిరుపతి: వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. అస్వస్థతకు గురైన వారిని అంబులెన్స్‌ల్లో తిరుపతిలోని ఆసుపత్రులకు తరలించారు. రుయా ఆసుపత్రిలో 20 మంది, స్విమ్స్‌లో 9 మంది చికిత్స పొందుతున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, తితిదే ఈవో శ్యామలరావు చేరుకొని వైద్యసేవలను పర్యవేక్షిస్తున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని తితిదే నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం ఇవాళ సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, అదనపు పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర పాలక కమిషనర్ తెలిపారు.

**తొక్కిసలాటకు కారణమిదే..** టోకెన్ల కోసం వచ్చిన భక్తులు రోడ్లపై గుమిగూడకుండా బైరాగిపట్టెడ వద్ద ఉన్న పద్మావతి పార్కులో ఉంచారు. అయితే, టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతకు గురి కావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించేందుకు క్యూలైన్ తెరిచారు. టోకెన్ల జారీ చేసేందుకు క్యూలైన్ ఓపెన్ చేశారని భావించిన భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్యూలైన్ల వద్ద సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని మరి కొందరు ఆరోపిస్తున్నారు. టోకెన్ల కోసం ఎంత మంది భక్తులు వచ్చారు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్థానిక సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించలేదని తెలుస్తోంది. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను గురువారం ఉదయం జారీ చేయాల్సి ఉంది. మిగిలిన రోజులకు సంబంధించి ఆయా తేదీల్లో తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో ఇవ్వనున్నట్టు తితిదే తెలిపింది. అయితే, భక్తుల రద్దీ కారణంగా ఇవాళ రాత్రి నుంచే టోకెన్లు జారీ చేస్తున్నట్టు ఈవో శ్యామలరావు తెలిపారు.

## అభివృద్ధి జాడ.. జిల్లా అంతా 'సుడా'!




కరీంనగర్: సుడా పరిధి పెరిగింది. అభివృద్ధి జాడలను మరింత విస్తరించుకుంది. కరీంనగర్ జిల్లా మొత్తం ఇక శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) పరిధిగా మారిపోనుంది. ఇందుకు సంబంధించి రాజముద్రను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. గతంలో పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈనెల 15వ తేదీన ఉత్తర్వులను వెల్లడించింది. చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి వరకు.. గన్నేరువరం మండలం పారువెల్ల నుంచి కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడ్ వరకు ప్రతి గ్రామం పట్టణాభివృద్ధిలో భాగంకానుంది.

ఏడేళ్ల కిందట ఏర్పాటైన సుడా క్రమంగా విస్తరించింది. మొదట కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు 61 రెవెన్యూ గ్రామాలతో ముడిపడిన ప్రాంతంగా ఆవిర్భవించింది. ఇందులోనే కాలక్రమంగా కొత్తపల్లి పురపాలిక అంతర్భాగమైంది. ఒక నగరపాలక సంస్థ, ఒక పురపాలికతోపాటు మిగతా గ్రామాలపై పర్యవేక్షణ కొనసాగింది. పెరుగుతున్న జనాభా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పరిధిని మరింత విస్తరించాలనే డిమాండ్ కొన్నాళ్లుగా వినిపించింది. ఇందుకనుగుణంగా ఇప్పుడు కొత్తగా అభివృద్ధికి చిగుర్లు తొడిగేందుకు మిగతా 3 పురపాలికలు (జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి)తోపాటు 147 రెవెన్యూ గ్రామాలను కలుపుకొని సరికొత్త పట్టణాభివృద్ధి సంస్థగా రూపుదిద్దుకుంది. మొత్తంగా జిల్లాలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు, మధిర గ్రామాలన్ని సుడాలోకి వచ్చేశాయి.

మారిన స్వరూపం..

విస్తరించిన పరిధితో సుడా స్వరూపం పూర్తిగా మారిపోయింది. 2017 అక్టోబరు 24న సుడా ఏర్పాటైంది. సరిగ్గా ఏడేళ్ల తరువాత మళ్లీ విస్తరణకు ఆదేశాలొచ్చాయి. అప్పుడు 8 మండలాల్లో ఉన్న పరిధి 16 మండలాలకు మారింది. 4.59 లక్షల జనాభా 527.29 చ.కి.మీ విస్తీర్ణం ఉండేది. ఇప్పుడు దాదాపు 11 లక్షల జనాభాతో జిల్లా భౌగోళిక విస్తీర్ణం 2128 చ.కి.మీ సుడాలో కలిసిపోయింది. భవిష్యత్తులో బృహత్తర ప్రణాళికను అంతటా అమలు చేస్తే సరికొత్త అభివృద్ధి అన్ని గ్రామాల్లో కనిపించే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సమృద్ధిగా అందుతాయి. విస్తరణతో ప్రగతి పరంగా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రణాళికాయుతంగా..

పరిధి పెరగడంతో ప్రణాళికాయుతంగా అభివృద్ధిని చేసుకునే అవకాశముంటుంది. ప్రజలకు అందించే సేవలో మా బాధ్యత పెరగనుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన తీరునుబట్టి సిబ్బంది నియామకంతోపాటు నిధులు మరిన్ని తీసుకొచ్చే దిశగా ప్రత్యేక చొరవ చూపిస్తాను. ఇక్కడ అక్కడ అని తారతమ్యం లేకుండా జిల్లా అంతా సమానాభివృద్ధికి అవకాశం ఉంటుంది.
కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా ఛైర్మన్

## వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ముస్తాబైన ఉద్దెమర్రి వెంకన్న ఆలయం
### ఉత్తర ద్వారం నుంచి స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు

శామీర్ పేట, (గరుడ వార్త) : అత్యంత ప్రాచీన ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన అతి పురాతనమైన, పవిత్రవాగు తీరాన ఉద్దెమర్రి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి ఉత్సవాలు ప్రతి సంవత్సరం వైభవంగా జరుగుతాయి. మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి లో జనవరి 10న శుక్ర వారం రోజున సాంప్రదాయ వైదిక ఆగమ పద్ధతిలో నిర్వహించే ఈ ఉత్సవ వేడుకలకై, వైకుంఠ ద్వార దర్శనార్ధం భక్తులు రానున్నందున దేవాలయంను, వైకుంఠ ద్వారా వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు



నిమగ్నమైయారు. ముక్కోటి ఏకాదశికి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి వైకుంఠనాథుడి దర్శణానికి వైకుంఠ ద్వార దర్శణ మండపాలను సిద్ధం చేశారు. మండపాన్ని ప్రత్యేకంగా ఆలంకరించి సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీ విష్ణు శివాలయంలో ఉన్న ఉత్తర ద్వారం నుంచే భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ విష్ణు శివాలయంకి భక్తులు శ్రీనివాసుడిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోన్నట్లు కమిటీ తెలియజేశారు.

**అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనేందుకు ఏర్పాట్లు....**తెల్లవారుజామున ఐదు గంటలకు ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి, భక్తుల ప్రవేశానికి అనుమతివ్వనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యేందుకు ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

## అలియాబాద్ రైతు వేదికను సందర్శించిన రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ.

శామీర్ పేట, (గరుడ వార్త) : రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ, ఐఏఎస్ రాజన్ విశాల్ అలియాబాద్ గ్రామ రైతువేదికను సందర్శించారు. బుధవారం శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామ పరిధిలోని రైతు వేదికను రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ, ఐఏఎస్ రాజన్ విశాల్ సందర్శించి తెలంగాణ లోని రైతువేదిక ల పనితీరు



తెలుసుకునేందుకు వచ్చినట్లుగా చెప్పారు. ఇందులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ పని తీరును పరిశీలించారు. అన్ని పథకాల విషయాలలో సెక్రటరీ రాజన్ విశాల్ సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కమీషనర్ కార్యాలయం డిడిఏ సింగారెడ్డి, ఏడిఏ వినోద్ కుమార్, మేడ్చల్ ఏడిఏ వెంకట్రామ్ రెడ్డి, ఏ ఓ రమేష్, ఏఈఓ లు రవి కుమార్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

## నాడు ఆహ్లాదం.. నేడు అధోగతి

పాల్వంచ : కేటీపీఎస్ 'ఏ' కాలనీలోని 'విద్యుత్ కళా భారతి' కళతప్పి కనిపిస్తోంది. నిర్వహణను విద్యుత్తు సంస్థ అధికారులు పక్కనెట్టేశారు. తాజాగా జెన్కో క్రీడాపోటీల నేపథ్యంలోనైనా పూర్వ కళ సంతరించకునేలా ఏర్పాట్లు పునరుద్ధరించాలని పురవాసులు, కేటీపీఎస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. కేటీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబాల వ్యాహ్యాళి, జెన్కో క్రీడా పోటీల నిర్వహణకు దశాబ్దాల క్రితం 'కళా భారతి' మైదానాన్ని పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేశారు. సంస్థకు చెందిన వారే కాకుండా, పురపాలకానికి చెందిన పలు వార్డుల ప్రజలు నడక సాధన, చిన్నారుల ఆటవిడుపు కోసం ఇక్కడకు వస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే వీరి సంఖ్య సుమారు వెయ్యి వరకు ఉంటుంది. కొన్నేళ్లుగా మైదానం నిర్వహణపై కేటీపీఎస్ యాజమాన్యం శీతకన్ను వేస్తోంది. వాకింగ్‌కు వచ్చేవారి సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. కనీసం కాపలా వంటి ఏర్పాట్లూ లేకపోవడం, రాత్రుళ్లు నిర్మానుష్యంగా ఉంటుండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకూ వేదికగా వాడుకుంటున్నారు. ఆవరణంలో పెరిగే పచ్చిక కోసం వచ్చే పశువుల తాకిడి ఎక్కువైంది. మరోవైపు శునకాల సంచారం నడక సాధకులను బెంబేలెత్తిస్తోంది. లక్షకు పైగా జనాభా గల పట్టణంలో ఉదయం, సాయంత్రం నడకకు ఎక్కువ సంఖ్యలో కళాభారతికే వస్తుంటారు. వచ్చేనెల 7వ తేదీ నుంచి టీజీ జెన్కో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. కనీసం మైదానాన్ని శుభ్రం చేసి.. ఆటసామగ్రికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కాపలాదారుణ్ని నియమించాలి

పట్టణం నడిబొడ్డున ఉన్న మైదానానికి గతంలో వేలాది మంది తరలివచ్చేవారు. రాన్రాను ఏర్పాట్లు, నిర్వహణపై దృష్టి తగ్గింది. కనీసం కాపలా అంటూ ఏమీ లేక కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కనీసం సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేస్తే రక్షణ, నిర్వహణకు వెసులుబాటు కలుగుతుంది. మరిన్ని సదుపాయాలు కల్పిస్తే పూర్వ వైభవం వస్తుంది.- దుర్గాప్రసాద్, పాల్వంచ

వసతులు కల్పిస్తే బాగు - రవీందర్, స్థానికుడు

ఉద్యోగులు, స్థానికులు వందలాది మంది మానసిక ఉల్లాసం కోసం రెండు పూటలూ తరలివస్తారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే కొందరు యువత వ్యాయామాలు, పరుగు సాధన చేస్తుంటారు. పిల్లల ఆటసామగ్రితో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుంది.

నిరుపయోగంగా పిల్లల ఆట సామగ్రి

కళాభారతి సమస్యలను కేటీపీఎస్ సివిల్ ఈఈ రాజీవ్ దృష్టికి తీసుకెళ్లగా.. మైదానం పరిశుభ్రతకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వసతులు కల్పించాలన్న పురవాసులు డిమాండ్‌ను పరిశీలిస్తామని చెప్పారు.

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సిరీస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు వినూత్న ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.



ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.

**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.

రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదలుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్యా బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింక్‌లు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసం**విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# దర్జాగా పొలాలకు..!



పెద్దపల్లి : పంట పొలాలకు వెళ్లడానికి రోడ్డు సరిగ్గా లేక ఇన్నాళ్లూ రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎరువులు, విత్తనాలు, పంట ఉత్పత్తులు తరలించడానికి నానా తంటాలు పడేవారు. వర్షాకాలంలో అయితే ఈ బాధ వర్ణణాతీతం. పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ సమస్యలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పొలాలకు వెళ్లే మట్టి రహదారులకు మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా వీటిని చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.9.22 కోట్లతో 168 కి.మీ పొడవు మేర రహదారుల పనులు మొదలయ్యాయి.168 కి.మీ మేర..

గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి ఎక్కువగా మట్టి దారులే ఉన్నాయి. కొన్ని దారుల్లో ఎడ్ల బండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 168 కి.మీ మేర ఇలాంటి రోడ్లను గుర్తించిన అధికారులు బాగు చేసేందుకు రూ.9.22 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం కాలినడకన ఉన్న బాటలను ఫార్మేషన్ రోడ్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి కూలీలు ఇరువైపులా కందకం తవ్వి.. ఆ మట్టిని రోడ్డుపై పోస్తున్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత మొరం వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 60 కి.మీ మేర పనులు చేయాలని మొదట భావించినా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 168 కి.మీ పనులకే పరిమితమయ్యారు.

**మార్చిలోపు గడువు**

రోడ్డు పనులు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాల్సి ఉంది. మార్చిలోపు పూర్తి చేసేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో యాసంగి వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. ఇలాంటి సమస్యలు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే.. నాసిరకంగా పనులు చేయకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. పనులు జరిగే సమీప పొలాల్లోని రైతుల అభిప్రాయాలు సేకరిస్తూ ముందుకు వెళ్తున్నారు.

**నాణ్యత లోపాలు లేకుండా ఆదేశాలు ఇచ్చాం**

**కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి**

రైతుల పంట పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎంపిక చేసిన పనులను ప్రారంభించి.. మార్చిలోపు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. పనుల ప్రగతిపై పర్యవేక్షిస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించాం.

# గాడి తప్పుతున్న ఆసుపత్రి నిర్వహణ



గోదావరిఖని : గత కొంతకాలంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో కొనసాగుతున్న ఆధిపత్యపోరుతో నిర్వహణ గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ వర్గాలతో జిల్లా కేంద్రంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్గదర్శనం చేశారు. అంతర్గతంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని, రోగులకు వైద్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ నేపథ్యంలో అయినా వివాదాలు సద్దుమణిగి నిర్వహణ మెరుగుపడుతుందేమో వేచి చూడాల్సిందే.

**ఏదీ సమయపాలన** ప్రధానంగా ఆసుపత్రి నిర్వహణలో కీలకమైనవారే సమయపాలన పాటించకుండా వారంలో రెండు రోజులు వస్తుండటం, బయోమెట్రిక్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడమే వివాదాలకు దారి తీసినట్లుగా భావించాల్సి వస్తోంది. అందరూ సమయపాలన పాటిం చేలా చర్యలు తీసుకోవాలని కోరిన కొందరిపై నిర్వాహకులు కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నా యి. గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెరగడంతో వైద్య రంగంలోని వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల్లోని ఆచార్యుల్లో కొందరు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వారంలో రెండు రోజులు మాత్రమే వస్తుండటంతో ఆయా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు నామమాత్రంగానే ఉంటున్నాయి. మిగతా వైద్యులపై పనిభారం పెరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ నామమాత్రంగా ఉండగా ప్రిన్సిపల్ పూర్తిస్థాయిలో ఆసుపత్రి నిర్వహణను పర్యవేక్షిస్తుండటం వివాదానికి కారణంగా తెలుస్తోంది. నేపథ్యంలో ఆసుపత్రిలోని కొందరు ఆచార్యులు, సహఆచార్యులు పూర్తిస్థాయిలో పనిచేసే సూపరింటెండెంట్ను నియమిం చాలంటూ గతంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారుల కు నివేదించారు. తాజాగా కొందరు రెసిడెంట్ మెడికల్ అధికారులు సైతం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆసుపత్రి నిర్వహణ తీరుపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఆయన అకస్మికంగా తనిఖీకి రాగా కొన్ని విభాగాల్లో కీలకమైన ఆచార్యులు విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకాలంగా కేవలం పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించిన రెసిడెంట్ మెడికల్ అధికారులు సైతం ఓపీ, ఐపీల్లో సేవలందించాలంటూ ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీచేయడం మరింత వివాదాస్పదంగా మారింది. ఆచార్యులేమో వారానికి రెండు, మూడు రోజులు వస్తుండగా రెగ్యులర్‌గా వచ్చే తమకు అదనంగా విధులు కేటాయించడమేమిటని ఆర్.ఎం.ఒ.లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆసుపత్రి నిర్వహణలో వివాదాలు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన పెద్దపల్లిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇకపై తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని, ఎప్పటికప్పుడు తమకు నివేదించాలని ఆదేశించారు. అంతర్గతంగా ఎలాంటి విభేదాలున్నా ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రపరిణామాలు తప్పవన్నారు. కాగా సార్వజనిక ఆసుపత్రి నిర్వహణ, వివిధ కొనుగోళ్లకు సంబంధించి విచారణ జరుగుతున్నట్లు సమాచారం. జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో ఆసుపత్రి నిర్వహణ గాడిన పడి మెరుగైన వైద్య సేవలందించే అవకాశముందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భూగర్భ గనులు కనుమరుగు

గోదావరిఖని: సింగరేణిలో భూగర్భ బొగ్గు గనుల స్థానంలో ఉపరితల గనులను ఏర్పాటు చేస్తున్నారు. అత్యధిక మానవశక్తిని వినియోగించి బొగ్గు ఉత్పత్తి చేసిన భూగర్భ గనులు ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో ఉపరితల గనులను ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి చేపడుతున్నారు. గతంలో 56 భూగర్భ గనులుండగా ప్రస్తుతం 21కి చేరుకున్నాయి. రానున్న కాలంలో వీటి సంఖ్య మరింత తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. భూగర్భ గనుల కంటే ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా చేపట్టే అవకాశం ఉండటంతో యాజమాన్యం ఆదిశగా చర్యలు తీసుకుంది. దీంతో పాటు కొత్త గనుల ఏర్పాటుకు కేంద్రం కొత్త చట్టం తీసుకురావడంతో ఉన్న వాటినే సర్దుకుంటూ బొగ్గు ఉత్పత్తి చేపట్టే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. కొత్త గనులు ఏర్పాటు చేయాలంటే వేలంలో పాల్గొనాల్సిందే. ఇటీవలే సింగరేణి ప్రాంతాల్లో ఉన్న నాలుగు గనులకు కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహించింది. అందులో రెండు గనులను ప్రైవేటు సంస్థలు దక్కించుకున్నాయి. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోవడం వల్ల బయటి వారి చేతుల్లోకి వెళ్లాయి. ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి గనులు కేటాయించాలని కోరుతున్నప్పటికీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు**

సింగరేణి వ్యాప్తంగా 35 భూగర్భ గనులు కనిపించకుండా పోయాయి. తాజాగా బెల్లంపల్లి ఏరియాలోని శాంతిఖని గనిని కూడా ఉపరితల గనిగా మార్చేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసింది. రామగుండం రీజియన్‌లో జీడీకే-5, 5-ఎ, 6, 6-ఎ, 6-బి, 7, 7-ఎ, 8, 8-ఎ, 9, 10, 10-ఎ భూగర్భ గనులు లేకుండా పోయాయి. వాటి స్థానంలో ఓసీపీ-1, 2, 3, 5లుగా విస్తరించాయి. భూగర్భ బొగ్గుగనుల్లో మిగిలిపోయిన నిక్షేపాలను పూర్తిస్థాయిలో వెలికి తీసేందుకు ఉపరితల గనులతోనే సాధ్యమవుతుందని భావిస్తున్న సింగరేణి ఆదిశగా చర్యలు తీసుకుంది. బెల్లంపల్లి రీజియన్‌లోని గోలేటి, మాదారం, కేకే-1, ఆర్‌కే-1-ఎ, ఆర్‌కే-8, ఎస్ఆర్‌పీ-2, ఆర్‌కే-5 బి, ఆర్‌కే-5, 6, 7, న్యూటెక్ గనులు భవిష్యత్తులో ఉపరితల గనిగా మారే అవకాశం ఉంది. కొత్తగూడెంలో వీకే-7, ఇల్లెందులో 21 ఇంక్లైన్‌లను మూసివేసి దాని స్థానంలో ఉపరితల గనిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కొత్తగా మరికొన్ని గనుల స్థానంలో ఉపరితల గనులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**ఉత్పత్తి చేపట్టే దిశగా..**

అపారమైన బొగ్గు నిక్షేపాలున్నప్పటికీ కొత్త గనులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో యాజమాన్యం విస్తరణ ప్రాజెక్టుల కింద ఉపరితల గనులను ఏర్పాటు చేస్తోంది. దీని వల్ల కొత్తగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. పాత గని కింద మాత్రమే దీనిని గుర్తిస్తారు. పర్యావరణ, ప్రాజెక్టు అనుమతులకు పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేకపోవడంతో యాజమాన్యం ఆదిశగా చర్యలు తీసుకుంటోంది. సింగరేణి సంస్థ కొత్త గనుల కోసం ప్రాజెక్టు నివేదికలు తయారు చేసుకుంది. వాటిని ఏర్పాటు చేసుకోవాలంటే కేంద్రం తీసుకువచ్చిన చట్టం ఎంఎండీఆర్(మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టం ప్రకారం తప్పనిసరిగా వేలంలో పాల్గొంటేనే కొత్త గనులు దక్కించుకోవచ్చు. సింగరేణి విస్తరించి ఉన్న పూర్వ నాలుగు జిల్లాల్లోని గోదావరి పరివాహక ప్రాంతంలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయి. వీటిని వెలికి తీసేందుకు సింగరేణి సంస్థ రాంపూర్, పునుకుడుచిలక, తాడిచెర్ల-2, చంద్రుపల్లి, ములుగు తదితర గనులను ప్రణాళిక చేసుకుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వాటిని ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో విస్తరణ ప్రాజెక్టులపైనే దృష్టి సారించింది.

# సమయం మిగులుతోంది మిత్రమా

చేగుంట: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలది పైచేయి అవుతోంది. ఒకప్పుడు ఎడ్లు, నాగళ్లు, కూలీలతోనే పూర్తిస్థాయిలో వ్యవసాయం చేసేవారు. సాగు విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. యంత్ర పరికరాలను వాడుతున్నారు. ఎండాకాలంలో, చలికాలంలో వానలు, వానకాలంలో ఉక్కపోత లాంటివి సంభవిస్తుండటంతో అదును దాటకుండా సాగు పనులు చేసుకోవడానికి యంత్ర పరికరాలు ఉపయోగపడుతున్నాయి. దిగుబడులూ పెరుగుతున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు కొనుక్కుంటున్నారు. మరికొందరు యంత్రాలను కిరాయికి తెచ్చి వాడుతున్నారు. ఒకరోజు మొత్తం చేసే పని.. కొద్ది గంటలల్లో పూర్తవుతోంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని ఎక్కువ గ్రామాల్లో యాంత్రీకరణ ఫలం వ్యవసాయంలో కనిపిస్తోంది. నాట్లు వేయటం, కలుపు తీయటం మాత్రం కూలీలతో ఇంకా చేయిస్తున్నారు. కొద్ది మందే యంత్రాలతో నాటేస్తున్నారు. ట్రాక్టర్లు ప్రతి గ్రామంలో పది, ఆపైన ఉన్నాయి. క్రిమిసంహారక మందులు పిచికారి చేసే యంత్రాలు వ్యవసాయం చేసే ప్రతి రైతు వద్ద ఉన్నాయి.ప్యాడీ హార్వెస్టర్: వరి కోయటానికి ఉపయోగిస్తారు. ఎకరం కోయాలంటే ఒక గంట సమయం పడుతుంది. సాధారణ పద్ధతిలో 6 గంటలు.

**కేజీవీల్స్:** వరి పొలంలో దుక్కి, దమ్ము చేస్తుంది. ఎకరం పొలాన్ని గంటలో పూర్తి చేస్తుంది. సాధారణ నాగలితో 4 గంటలు పడుతుంది.

**రోటావేటర్:** ట్రాక్టర్ సహాయంతో దుక్కి దున్నొచ్చు. దమ్ము చేస్తారు. ఒక గంటలో ఎకరం పొలంలో పని పూర్తి చేస్తుంది. సాధారణ నాగలితో 6 గంటలవుతుంది.

**డ్రోన్:** పొలంలో రసాయనిక మందులు పిచికారీ చేయటానికి ఉ



పయోగపడుతుంది. ఎకరం విస్తీర్ణంలో చేయటానికి 15 నిమిషాలు అవుతుంది. ఒక వ్యక్తికి గంట సమయం పడుతుంది.

**ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్:** ట్రాక్టర్ సహాయంతో నడుస్తుంది. పత్తి పంటలో పయోగిస్తారు. ఒక గంటలో 2 నుంచి 3 ఎకరాలు పిచికారీ చేస్తుంది. ఒక వ్యక్తి చేస్తే మాత్రం 4 గంటలు.

**ట్రాక్టర్ మౌంటెడ్ కల్టివేటర్:** పొలంలో దుక్కి చేసేందుకు ఉపయోగిస్తారు. గంటలో 2 ఎకరాల దుక్కి చేస్తుంది. పాత పద్ధతిలో 5 గంటల కాలం.

**ట్రాక్టర్ డ్రాన్ ఫ్లఫ్:** దుక్కి చేస్తుంది. నేలలోని మట్టిని పైకి .. పైమట్టిని లోపలికి ఒక గంటలో తిరగబెడుతుంది. ఎడ్లతో నడిచే నాగలికి 6 గంటలు.

మొక్కజొన్న తొలిచే యంత్రం: ఒక గంటలో 45 క్వింటాళ్లు వలుస్తుంది. చేతితో చేపడితే 4 రోజులు.

**పవర్ వీడర్స్:** ఒక ఎకరానికి 2 గంటలు పడుతుంది. మనుషులతో చేయిస్తే 6 గంటల సమయం అవుతుంది

విత్తనాలు, ఎరువులు వేయడానికి: ఒక గంటలో ఎకరా పొలంలో విత్తనం, ఎరువులను వేస్తుంది. మామూలు పద్ధతిలో 6 గంటల సమయం పడుతుంది.

**వేగంగా నాట్లు వేసేందుకు.. :** దీనిని పొలంలో నాట్లు వేసేందుకు ఉపయోగిస్తారు. ఎకరా పొలంలో 2 గంటల్లో నాట్లు వేస్తుంది. మనుషులతో 5 గంటలు అవుతుంది.

**గడ్డి చుట్టి.. కట్ట కట్టి..:** వరి గడ్డిని కట్టలుగా చుడుతుంది. ఒక గంటలో ఎకరంలో చుట్టి వేస్తుంది. పాత పద్ధతిలో 7 గంటలు.

# కదలని క్రమబద్ధీకరణ

సిద్దిపేట : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. ఇందుకోసం నియమించిన కమిటీలు నివేదికలు ఇవ్వడంలో జాప్యం కారణంగా పరిశీలన ప్రక్రియ ఆలస్యమవుతోందని విమర్శలున్నాయి. సంక్రాంతి దాటితే ఇళ్ల నిర్మాణాలకు ముహూర్తాలుంటాయని, ఆలోపు అనుమతులు వస్తే నిర్మాణాలు ప్రారంభించుకునేందుకు అనువుగా ఉంటుందని దరఖాస్తుదారులు చెబుతున్నారు.అనుమతులు లేని వెంచర్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలకు దూరమైన ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు అనుమతిచ్చింది. ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఎల్ఆర్ఎస్ విషయం మరోమారు తెరపైకి వచ్చింది. దరఖాస్తులను క్రమబద్ధీకరించేందుకు



ప్రభుత్వం గత అక్టోబరులో కమిటీలు వేసింది. జిల్లాలో 549 మందితో 29 కమిటీలు ఏర్పాటయ్యాయి.

**ఇప్పటి వరకు 35 శాతమే**

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 35 శాతం వరకే ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 11548 దరఖాస్తులు రాగా 3 వేల వరకు పరిశీలించారు. సంబంధీకులకు సందేశాలు పంపించారు. ఇందులో 60 మంది వరకు ఫీజు చెల్లించినట్లు సమాచారం.

**పరిశీలనకు ప్రత్యేక యాప్**

నవంబరు 2020 వరకు జిలా వ్యాప్తంగా సుమారు 80 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు ప్రత్యేక యాప్ తయారు చేశారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, టౌన్‌ప్లానింగ్ మూడు లాగిన్లు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుకు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న యజమానికి సంబంధం లేకపోవడం వంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చరవాణి నంబర్లు మనుగడలో లేకపోవడం, స్థలాల హద్దులు సరిగా లేక ఇబ్బందిగా మారుతోందని అధికారులు చెబుతున్నారు.

# లోలోపలికి..

హైదరాబాద్ : మహానగరంలో భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయి. ఒక నెలలోనే నగరంలో అర మీటరు నుంచి మీటరు దాకా జలమట్టాలు పడిపోవడం రానున్న వేసవికి ప్రమాద సూచికగా నిపుణులు పేర్కొంటున్నారు. నగరంలో గతేడాదికి కంటే కొంచెం మెరుగ్గా ఉన్నా చుట్టుపక్కల ప్రాంతాలు ప్రధానంగా ఓఆర్ఆర్ లోపల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో మాత్రం భూగర్భ జలాలు తగ్గాయి. వేసవి నాటికి మరింత దిగజారే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్**

ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్లు పనిచేయడంలేదు. ఫలితంగా పదిరోజులుగా నగరంలో జలమండలి నీటి ట్యాంకులకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఉన్న ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు మార్చి వరకు సరిపోతాయని, డిమాండ్ పెరిగితే అందుకు అనుగుణంగా ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లను పెంచుకునేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 600 ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా, అదనంగా మరో 200 ట్యాంకర్లను సిద్ధం చేసుకుంటోంది. మే, జూన్ నెలల్లో డిమాండ్ తారాస్థాయికి చేరుతుందని జలమండలి



అంచనా వేస్తోంది. గతేడాది మార్చిలో 1.69 లక్షలు, ఏప్రిల్‌లో 2.45 లక్షలు, మేలో 2.28 లక్షలు, జూన్‌లో 1.8 లక్షలు, జులైలో 1.47 లక్షల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

**ఇంకుడు గుంతలపై ఉదాసీనత**

జలమండలి పరిధిలో 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న అన్ని నివాస, నివాసేతర ప్రదేశాల్లో విధిగా ఇంకుడుగుంత ఉండాలనే నిబంధన ఉన్నా ఇది పకడ్బందీగా అమలు కావడం లేదు. జలమండలి 25,578 ప్రాంగణాల్లో తనిఖీ చేయగా కేవలం 12,446 చోట్ల మాత్రమే ఇంకుడుగుంతలు ఉన్నాయని గుర్తించారు. మరో 13,132 ప్రాంగణాల్లో లేవని వెంటనే నిర్మించుకోవాలని నోటీసులు ఇచ్చారు. ఇంకుడుగుంతలు లేని ఆవాసాలకు వాటర్ ట్యాంకర్ ఛార్జీలను వచ్చే ఏడాదినుంచి రెట్టింపు చేయాలని ఇప్పటికే జలమండలి నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా పరిధిలో స్వల్పంగా పెరుగుదల ఉన్నా అది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉందని అధికారులు చెబుతున్నారు. డిసెంబరు ఆఖరు నాటికి భూగర్భజల వనరుల శాఖ తాజా విశ్లేషణ ప్రకారం హైదరాబాద్‌లో నవంబరు కంటే డిసెంబరులో 0.47 మీటర్ల భూగర్భజల మట్టాలు తగ్గగా మేడ్చల్-మల్కాజ్‌గిరి పరిధిలో 1.08 మీటర్లు అడుగంటాయి. హైదరాబాద్‌లో భూగర్భజల మట్టాలు 6.96 మీటర్లు, మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 10.35 మీటర్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలో 9.08 మీటర్లుగా గుర్తించారు. జీహెచ్ఎంసీ పరిధిలో భూగర్భజల మట్టాలు గత ఏడాదికంటే పడిపోయినట్లు విశ్లేషిస్తున్నారు. నగరంలో సాధారణం కంటే 18 శాతం అధిక వర్షపాతం నమోదైనా ఆ మేరకు భూగర్భజలాలు రీఛార్జ్ కావడంలేదు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పడిన వర్షపు నీరు అంతా వేగంగా నాలాలు, కాలువల్లో చేరి మూసీలో చేరుతోంది. నీరు ఇంకే పరిస్థితి తక్కువగా ఉంది.

# క్యాన్సర్ రోగుల నిరీక్షణకు తెర

హైదరాబాద్: ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న క్యాన్సర్ రోగులకు పెద్ద ఊరట లభించనుంది. ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలు ఇక నుంచి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలోనే అందుబాటులోకి రానున్నాయి. ఈ యంత్రాలను ఇప్పటికే సిద్ధం చేశారు. త్వరలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. ఎంఎన్‌జేకు అన్నవాహిక, జీర్ణకోశ, పొట్ట, పెద్దపేగు తదితర క్యాన్సర్ రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఏటా 10 వేల క్యాన్సర్లు నమోదు అవుతుంటే అందులో వీటి సంఖ్యే ఎక్కువ. ఈ బాధితులకు తొలుత ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలు చేయాలి. ఇప్పటివరకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో లేవు. గాస్ట్రోఎంటరాలజీ నిపుణుల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేయాల్సి రావడంతో ప్రస్తుతం ఉస్మానియాకు రోగులను పంపుతున్నారు. అక్కడ రద్దీ పెరగడంతో పరీక్షల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్నిసార్లు 20-30 రోజుల నిరీక్షణ తప్పడం లేదు. జాప్యం కారణంగా కొందరిలో వ్యాధి ముదిరిపోయే ప్రమాదం ఉత్పన్నమవుతోంది. దీంతో కొందరు ప్రైవేటు ల్యాబ్‌ల్లో చేయించుకుంటున్నారు. ఎంఎన్‌జేకు నిత్యం 500-700 వరకు ఓపీ ఉంటోంది. ఇందులో వందకు పైగా కొలనోస్కోపీ, ఎండోస్కోపీ పరీక్షలు అవసరం




అవుతుంటాయి. ఆసుపత్రి వైద్యులు పలుమార్లు వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు యంత్రాలను సమకూర్చారు. ప్రస్తుతం యంత్రాల నిర్వహణకు నిపుణులకు శిక్షణ ఇస్తున్నారు.

**సర్జరీ ప్రొఫైల్‌కు ఉస్మానియానే దిక్కు..**

ఏదైనా శస్త్రచికిత్స చేసే సమయంలో మధుమేహం, హెచ్ఐవీ, హెపటైటీస్ ఇతర రక్త పరీక్షలతోపాటు గుండె పనితీరు పరిశీలనకు 2డీ ఈకోలాంటి పరీక్షలు చేస్తారు. కొన్ని రకాల క్యాన్సర్లకు సర్జరీలు చేయాలి. సర్జరీ ప్రొఫైల్ కోసం ఇప్పటికీ ఉస్మానియాకే రోగులను పంపిస్తున్నారు. అక్కడికి ఉదయం వెళ్తే పరీక్షలు చేసేసరికి సాయంత్రమవుతోంది. కొన్నిసార్లు రద్దీ ఉంటే రెండోరోజూ వస్తున్నామని రోగులు వాపోతున్నారు. సర్జరీ ప్రొఫైల్‌కు సంబంధించి త్వరలో ఎంఎన్‌జేలోనూ పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఎండోస్కోపీ, కొలనోస్కోపీ సేవలు ప్రారంభించిన తర్వాత వీటిపై దృష్టిసారిస్తామని పేర్కొన్నారు.

# నివేదికలు సిద్ధం



మెట్‌పల్లి: ఆరు నెలల వ్యవధిలో మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థుల మృతి, అస్వస్థతకు గురైన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపాయి. గురుకులంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురై కోలుకున్న సంగతి తెలిసిందే. మృతి చెందిన ఇద్దరు, అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థుల వైద్య నివేదికలు సిద్ధమయ్యాయి. హైదరాబాద్‌లోని నిమ్స్, నిజామాబాద్‌లో చికిత్స పొందిన మరో నలుగురు విద్యార్థుల వైద్య నివేదికలు రానట్లు తెలుస్తోంది. వాస్తవానికి జులైలో మొదటి, ఆగస్టులో రెండో ఘటన జరగగా, వైద్య నివేదికలపై దాటవేస్తూ వచ్చారు. ఇటీవల డిసెంబర్‌లో మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెంది వైద్య నివేదికలపై అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులు ఎలా మృతి చెందారు? ఎందుకు అస్వస్థతకు గురయ్యారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు మృతి చెందిన ఇద్దరు, డిసెంబర్‌లో అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థుల నివేదికలను సిద్ధం చేసి సంబంధిత విద్యార్థుల కుటుంబ సభ్యులకు వైద్య వర్గాల ద్వారా అందించేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**నివేదికలో ఏముంది..**

మృతి చెందిన గణాదిత్య శ్వాస తీసుకోవడం కష్టమై ఫిట్స్ వచ్చి ఆక్సిజన్ అందడం ఇబ్బందిగా మారడం కారణం కావచ్చని పోస్టుమార్టం నివేదిక ద్వారా తెలుస్తోంది. అనిరుధ్ కిడ్నీలు దెబ్బతిన్నాయని, ఏదైనా విష కీటకం నాకడం వల్ల జరిగే అవకాశమున్నా, నిర్ధారించలేమని ఫోరెన్సిక్ పరీక్షల ఆధారంగా నివేదికలో వెల్లడించారు. అస్వస్థతకు గురై కోలుకున్న అఖిల్ బ్లీడింగ్, క్లాటింగ్ సమయాల్లో మార్పు ఉందని, కుడి చేతిపై నొప్పి, హిమటోటాక్సిన్, పంక్చర్ మార్క్స్, హోల్ బ్లడ్ క్లాటింగ్ సమయంలో మార్పు ఉందని తేల్చారు. యశ్విత్ కుడి కాలుపై పంక్చర్ మార్క్స్ ఉన్నాయని, రక్తం బ్లీడింగ్, క్లాటింగ్ సమయాలు నార్మల్‌గా ఉన్నాయని తేల్చారు. ఇదిలా ఉంటే విద్యార్థుల మృతి, అస్వస్థతకు గురైన ఘటనలు ఉదయం వేళల్లోనే జరిగాయి. విద్యార్థులు తెల్లవారుజామున లేచి ఆవరణలో ప్రహరీకి దగ్గర్లో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్ల వద్దకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటారు. విద్యార్థులు వచ్చిపోయే సమయంలో ఏవైనా విష కీటకాలు కాటు వేయడం వల్ల ఘటనలు జరిగి ఉండవచ్చనే అనుమానాలున్నాయి. పన్నెండెకరాల విస్తీర్ణంలో ఉన్న గురుకులం చుట్టూ పంట పొలాలున్నాయి. గతంలో పరిసరాలు శుభ్రం చేసిన సమయంలో కొన్ని పాములు కనిపించాయి. కట్ల పాములు నాకుతాయని, రక్తపింజర వల్ల హిమటోటాక్సిన్ పాయిజన్ చేరుతుందని తెలుస్తుండగా, కోలుకున్న ఆరుగురు విద్యార్థులకు యాంటీవీనమ్ ఇంజక్షన్లు ఇచ్చి చికిత్స అందించిన తర్వాతే ఆరోగ్య పరిస్థితి మెరగవడం గమనార్హం.

**దిద్దుబాటు చర్యలు..**

మొదటి ఘటన జరిగిన సమయంలో గురుకులంలో నూతన భవనం అసంపూర్తిగా ఉండడంతో పాటు పరిసరాలు అధ్వానంగా ఉండేవి. రెండో ఘటన అనంతరం అధికార యంత్రాంగం మేల్కొని దిద్దుబాటు చర్యలు చేపట్టింది. నూతన భవనం అందుబాటులోకి తెచ్చి పడక మంచాలు, ఆవరణలో లైటింగ్, శిథిలావస్థకు చేరిన గదులు కూల్చడం, పరిసరాలు శుభ్రం చేయడం, ఆవరణలో మొరం పోయడం, డెస్క్ బెంచీలు, కిటికీలకు మెస్‌జాలీలు, కొన్ని సీసీ కెమెరాలు అమర్చారు. అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షించారు. అయినా డిసెంబర్‌లో మరో ఘటన జరగడంతో ప్రహరీ మధ్య ఉన్న ఖాళీలు, పాడుబడ్డ బావి పూడ్చడం, చెట్లను తొలగించడం, రంధ్రాలను మూసివేయడం చేశారు. పడక గదుల్లో సీసీ కెమెరాలను అమర్చారు. వెంటిలేటర్లకు సైతం మెస్‌జాలీ అమర్చారు.

**ఏం జరిగింది..**

గతేడాది జులై 26న మెట్‌పల్లి పట్టణ పరిధిలోని ఆరపేటకు చెందిన 8వ తరగతి విద్యార్థి రాజారపు గణాదిత్య మృతి చెందగా, మెట్‌పల్లికి చెందిన రాపర్తి హర్ష, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్‌కు చెందిన ఆడెపు గణేష్ అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొంది కోలుకున్నారు. ఆగస్టు 9న ఆరో తరగతి చదువుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన ఎడమల అనిరుధ్ మరణించగా అస్వస్థతకు గురైన మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన మొండి మోక్షిత్, మల్యాల మండలం తాటిపల్లికి చెందిన హేమంత్‌యాదవ్‌కు నిజామాబాద్‌లో చికిత్స అందించగా కోలుకున్నారు. డిసెంబర్ 18న 8వ తరగతి చదువుతున్న మెట్‌పల్లికి చెందిన ఓంకార్ అఖిల్, మరుసటి రోజు రాజన్న సిరిసిల్లకు చెందిన బోడ యశ్విత్ అస్వస్థతకు గురయ్యారు. కోరుట్లలో చికిత్స అందించగా కోలుకున్నారు.

**ఇంకా చేయాల్సినవి..**

ప్రహరీ, నూతన భవనం చుట్టూ మరిన్ని సీసీ కెమెరాలు అమర్చాలి.
ప్రహరీ చుట్టూ సౌర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
నూతన భవనంలోనే మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. లేకపోతే పక్కనే ఏర్పాటు చేయాలి.
నూతన భోజనశాల నిర్మించాలి.
ప్రస్తుతమున్న భవనం కేవలం తరగతులకే సరిపోతోంది. అదనంగా డార్మెటరీ భవనం నిర్మించాలి.
నైట్ వాచ్‌మెన్ ఒకరు ఉంటుండగా, మరొకరిని అదనంగా నియమించాలి.
భోజనశాల, మూత్రశాలలకు వెళ్లేందుకు నూతన భవనం నుంచి నేరుగా సీసీ రోడ్డు నిర్మించాలి. స్టాఫ్‌నర్సు, మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. వైద్య శిబిరాల ఏర్పాటు, అధికారుల పర్యవేక్షణ పెంచాలి.

# తాగునీటి కష్టాలు



జగిత్యాల : జగిత్యాల పట్టణంలో 20 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పలు కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతోపాటు ధర్మసముద్రం జలాశయంలో నీరు సమృద్ధిగా లేకపోవడంతో సరఫరా పూర్తిగా తగ్గించేశారు. పట్టణంలో 18 వేల నల్లా కనెక్షన్లుండగా ఇందులో 10 వేల కనెక్షన్లకు నీరందడంలేదు. కొత్తబస్టాండు నీళ్ల ట్యాంకు పరిధిలోని పలు కాలనీలకు సరఫరా నిలిచిపోయింది. మొన్నటి వరకు రెండు రోజులకోసారి బల్దియా నీటిని సరఫరా చేసినా చెరువులో నీరు మరింత తగ్గడంతో అధికారులు చేతులెత్తేశారు. గాంధీనగర్, మంచినీళ్లబావి, పురాణిపేట, శ్రీరాంనగర్, వంజరివాడ తదితర ప్రాంతాల్లో నల్లా నీరు రావడంలేదు. బల్దియాకు 6 ట్యాంకర్లున్నా ఒక్క ట్యాంకరుతోనే నీటిని సరఫరా చేయడం గమనార్హం. 6 వాహనాలకు ముగ్గురే డ్రైవర్లు ఉండటం వీరిలో ఇద్దరిని హరితహారం కోసం వినియోగిస్తున్నారు. కేవలం పురపాలక నీటిపైనే ఆధారపడే కుటుంబాలు బల్దియా తీరుపై మండిపడుతున్నాయి. వేసవికి ముందే నీటి ఎద్దడి తలెత్తడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పట్టింపులేని అధికారులు..**

ఏటా ఎస్సారెస్పీ కెనాల్ నుంచి ధర్మసముద్రం చెరువు నింపేవారు. భగీరథ నీటిపైనే ఆధారపడ్డ బల్దియా జలాశయంలో నీటిని నిలువ చేయడంలో అశ్రద్ధ వహించింది. దీంతో 940 అడుగులు సామర్థ్యం కలిగిన జలాశయం 930 అడుగులకు పడిపోయింది. పట్టణంలో 18 వేల నల్లా కనెక్షన్లకు 17 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. భగీరథ నీరు మరమ్మతు కారణంగా నిలిచిపోవడం, చెరువులో నీరు తగ్గడంతో అధికారులు సరఫరా తగ్గించేశారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ 20 రోజులైనా సమస్యను పరిష్కరించలేకపోయారు. కాలనీల్లో ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో భూగర్భజలాలు తక్కువగా ఉన్న తులసినగర్, వాణీనగర్, హౌజింగ్‌బోర్డు తదితర కాలనీల్లో బల్దియా నీటిని అధికంగా వినియోగిస్తారు. అధికారులు మందుచూపుగా వ్యవహరించకపోవడమే తాగునీటి ఎద్దడికి కారణమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. **ఎస్సారెస్పీ జలాలతో చెరువు నింపుతున్నాం: చరణ్‌తేజ, ఏఈ** ఎస్సారెస్పీ జలాలతో చెరువును నింపుతున్నాం. వారానికోసారి విడుదలయ్యే నీటిని జలాశయానికి పంపిస్తున్నారు. చెరువు నిండాలంటే కనీసం నెల రోజులైనా పడుతుంది. మరోవైపు మిషన్ భగీరథ మరమ్మ తు పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఒక ట్యాంకరుతో కాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నాం. అవసరాన్నిబట్టి హరితహారం ట్రాక్టరు కూడా వినియోగిస్తున్నాం. 6 ట్యాంకర్లున్నా మూడింటికి డ్రైవర్లు లేకపోవడంతో ఇటీవలే నియామకానికి టెండర్లు పిలిచాం.

# అభి'రుచి' చూపిన ఉపాధి

సుల్తానాబాద్ : ఇంట్లోనే ఖాళీగా ఉంటూ కబుర్లతో కాలక్షేపం చేయడం వారికి నచ్చలేదు.. తమకు వచ్చిన పనిలోనే ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు.. ప్రతి నెలా నికరమైన ఆదాయం గడిస్తూ కుటుంబ పోషణలో అండగా నిలుస్తున్నారు..

**విశ్రాంతి లేకుండా కుటుంబానికి అండ** సుల్తానాబాద్ పాతవాడకు చెందిన వంగల పద్మ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కనే దుకాణం ఏర్పాటు చేసుకొని కోడలు మమత, ఇద్దరు పనివాళ్ల సాయంతో సకినాలు, గారెలు, మురుకులు, లడ్డూలు తదితర పిండివంటలు తయారు చేస్తున్నారు. అన్ని రకాల పచ్చళ్లు పెడుతూ కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నారు. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు ఆర్డర్లు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం చపాతీలు, జొన్న, రాగి రొట్టెలు చేస్తూ రూ.10కి ఒకటి చొప్పున అమ్ముతున్నారు. ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు సంపాదిస్తున్న పద్మ కుటుంబ పోషణలో అండగా ఉంటున్నారు.

**కర్రీ పాయింట్‌తో ముగ్గురికి ఆదాయం** సుల్తానాబాద్ స్వప్నకాలనీకి చెందిన గంధం పద్మ, నోముల విమల, తిప్పర్తి స్వప్న ఇరుగు పొరుగు ఇళ్లలో ఉండే గృహిణులు. పిల్లలకు పెళ్లిళ్లు కావడంతో ఖాళీగా ఉండే బదులు కలిసి ఏదైనా వ్యాపారం చేయాలని భావించారు. అనుభవం లేని వ్యాపారం కన్నా వచ్చిన వంటలు చేద్దామని నిర్ణయించారు. రెండేళ్ల కిందట స్వప్నకాలనీ మెయిన్ రోడ్డులో రూ.80 వేల పెట్టుబడితో 'మహాలక్ష్మి' కర్రీ పాయింట్ ప్రారంభించారు. శాఖాహార, మాంసాహార వంటలు చేసి విక్రయిస్తున్నారు. చికెన్, మటన్‌తో పచ్చళ్లు పెట్టి కిలోకు రూ.600 చొప్పున అమ్ముతున్నారు. సకినాలు, గారెలు, లడ్డూలు తదితర పిండివంటలు, చపాతీలు, జొన్న, రాగి రొట్టెల తయారీతో ప్రతి నెలా తలా రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. ఇంట్లో కాలక్షేపం చేయడం కన్నా వంట చేస్తూ పది మంది కడుపు నింపుతున్నామన్న సంతృప్తి ఉంటోందని చెబుతున్నారు.

# మత్తు మూలాలు పసిగట్టేలా 'నార్కోటిక్ టీమ్'

హైదరాబాద్: నగరంలో మత్తు పదార్థాల రాక, వినియోగాన్ని అడ్డుకోవడానికి ఆబ్కారీ శాఖ కొత్త అస్త్రంతో సిద్ధమవుతోంది. కొత్తగా నార్కోటిక్ టీమ్ పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి నిర్ణయించారు. ఎస్‌వోటీ, టాస్క్‌ఫోర్స్ తరహాలో వీటి పనితీరు ఉండేలా.. కేవలం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపైనే దృష్టిసారిస్తారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు సహా మొత్తం



20 మందితో ఈ బృందం ఉంటుంది. కల్తీ, పన్ను చెల్లించని మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు ఆబ్కారీ శాఖలో ప్రస్తుతం నాలుగు స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉన్నాయి. అందులో రెండు పోలీసులతో కూడిన ఎస్టీఎఫ్‌లు, మరో రెండు ఆబ్కారీ శాఖ అధికారులతో ఉండగా.. వీటిపై పనిఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే నార్కోటిక్ టీమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కమలాసన్‌రెడ్డి ప్రకటించారు. డ్రగ్ ఫ్రీ హైదరాబాద్, డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా సాగుతామన్నారు.

# పాతబస్తీ మెట్రో భూసేకరణలో కీలకఘట్టం

హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైలు పనుల ప్రారంభానికి మార్గం సుగమం అవుతోంది. రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న యజమానులకు పరిహారం పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. చెక్కులపంపిణీ సోమవారం ప్రారంభం కానుంది. మెట్రో రెండో దశలోని కారిడార్-6ను ఎంజీబీఎస్-చంద్రయాణగుట్ట వరకు నిర్మించనున్నారు. మొదటి దశలోనే పూర్తి చేయాల్సి ఉండగా..ఆస్తుల సేకరణ, అలైన్‌మెంట్ వివాదాలతో పదేళ్లుగా నిలిచిపోయింది. దీంతో రెండో దశలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన రైట్ ఆఫ్ వే కోసం ముందుగా రహదారులు విస్తరించాలి. సర్వే చేపట్టగా 1100 ఆస్తులను సేకరించాల్సిఉంటుందని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు విడతలవారీగా జారీ



చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారు.

**169మంది సమ్మతి:** లక్డీకాపూల్‌లోని మధ్యాహ్నం 2 గంటలకు పరిహారం చెక్కుల పంపిణీ జరుగుతుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 169 మంది సమ్మతి తెలుపుతూ పత్రాలిచ్చారని వెల్లడించారు. తొలుత 40మందికి చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరవుతారని వివరించారు. సీఎం ఆదేశాలతో త్వరితగతిన మెట్రో పనులు చేపట్టేలా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

# అందుబాటులో ఆలన.. వృద్ధులకు సాంత్వన

వికారాబాద్ : హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా పూర్తిగా వెనుకబడి ఉంది. ఈ జిల్లాలో వైద్య సేవలు అంతంత మాత్రమే. అలాంటిది జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి వైద్య సేవలు కాస్త మెరుగవుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి 'మేమున్నామంటూ' 'ఆలన' (పాలిటివ్ కేర్ సెంటర్) కేంద్రం సిబ్బంది ఇస్తున్న భరోసాను పేర్కొనవచ్చు.

**ఇప్పుడిప్పుడే సేవలు విస్తరణ** వికారాబాద్ అనంతగిరి కొండలపై 2021లో 'ఆలన' పాలియేటివ్ కేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడిప్పుడే ఈ కేంద్రం సేవలు విస్తరిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను గుర్తించి తగిన సేవలందిస్తున్నారు. ఈ కేంద్రంలో 8 పడకలు, ఫర్నిచర్ ఏర్పాటుతోపాటు మెడికల్ అధికారి, నర్సులు, ఆయాలను నియమించారు.

**దీర్ఘకాలిక వ్యాధులకు సేవలు** దీర్ఘకాలికంగా క్యాన్సర్, పక్షవాతం, రోడ్డు ప్రమాదాలతో లేవలేని వారికి ఇక్కడ ఫిజియోథెరఫీ చికిత్సలు అందిస్తున్నారు. ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందించేందుకు వాహనం కేటాయించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ రకాల శస్త్ర చికిత్సలు, సేవలు పొందిన వృద్ధులకు వైద్యుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు ఆసుపత్రిలో, మరో మూడు రోజులు ఇళ్ల వద్ద సేవలు అందజేస్తున్నారు. హైదరాబాద్ ఎంఐజీ క్యాన్సర్ ఆసుపత్రి వారు జిల్లాకు చెందిన వారిని ఈ కేంద్రానికి రిఫర్ చేస్తారు. జిల్లాలో సుమారు 80 నుంచి 100 వరకు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వయోవృద్ధ రోగులున్నారు. పక్షవాతం బారిన పడిన వారు సుమారు 800 మంది వరకు ఉన్నారు. ఈ కేంద్రంలో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, హోమ్ కేర్ విభాగాలున్నాయి. క్యాన్సర్ రోగుల్లో కొందరికి ట్యూమర్‌లు ఏర్పడతాయి. ఈ గడ్డను ప్రత్యేకంగా శుభ్రం చేసి డ్రెస్సింగ్ చేస్తారు. వీరికి అవసరమైన మందులు కూడా ఇస్తారు. రోగులు సంప్రదిం చవచ్చు.

**సద్వినియోగం చేసుకోండి..** పాలిటివ్ కేర్ సెంటర్ ద్వారా రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నాం. మందులు ఉంచితంగా పంపిణీ చేస్తున్నాం. వృద్ధులు, రోగులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కేంద్రాన్ని కొత్తగా నిర్మిస్తున్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోకి తరలిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

## యథేచ్ఛగా కల్తీ దందా

హైదరాబాద్: ఘాటు వాసన వచ్చేందుకు సిట్రిక్ యాసిడ్‌తో అల్లం పేస్టు.. తెల్లగా, చిక్కగా కనిపించేందుకు ఎసిటిక్ యాసిడ్‌తో పాలు.. కుళ్లిన మాంసం కొవ్వుతో వంటనూనె, నెయ్యి..ఇదీ నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ కోసం కొందరు నేరగాళ్లు చేస్తున్న దారుణాలు. ఇలాంటివి ఆహార భద్రతా విభాగం, టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసుల తనిఖీల్లో వెలుగుచూస్తున్నా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడక పోవడానికి కారణం కోరల్లేని చట్టాలే. నిందితులపై పోలీసులు కేసులు నమోదుచేస్తున్నా.. కఠిన శిక్షలుండటం లేదు. ఇదే అవకాశంగా నగరంలో కల్తీదందాను కొందరు కొనసాగిస్తున్నారు.



**అలా కేసులు.. ఇలా బయటకు..**

నగరంలో కల్తీ ఆహారం ఎక్కడ పట్టుబడ్డా భారతీయ న్యాయ సంహితలోని 274, 275 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదుచేస్తున్నారు. ఈ సెక్షన్ల ప్రకారం ఆరునెలల జైలుశిక్ష, లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించే అవకాశముండదు. కల్తీ దందాతో రూ.కోట్లు ఆర్జిస్తున్న కేటుగాళ్లపై ఇలాంటి సాధారణ సెక్షన్ల ప్రయోగంతో వారిలో భయంఉండటంలేదు. ఉదాహరణకు సౌత్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కిన నిందితుడు ఇమ్రాన్ సలీమ్ గతంలో కల్తీ పదార్థాల తయారీతో మూడుసార్లు చిక్కాడు. అయినా భయం లేకుండా నాలుగోసారి చీకటి దందా చేస్తూ పట్టుబడ్డాడు.

**తూతూమంత్రంగా తనిఖీలు**

ఆహార కల్తీ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం- 2006ను తీసుకొచ్చింది. ఆహార భద్రతా విభాగం ఈ చట్టం అమలును పర్యవేక్షించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో జరగడం లేదు. కొన్నిసార్లు ఫలానా ప్రాంతంలో ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకుని పోలీసులు సోదాలు చేస్తున్నారు. తర్వాతే ఆహార భద్రతా విభాగం అధికారులు అక్కడకు చేరుకుంటున్నారు. వారు నిత్యం తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా దృష్టి సారించక పోవడం ఓ సమస్యగా మారుతోంది

## రోగాలు తగ్గిస్తామంటూ తప్పుడు ప్రకటనలు.. డీసీఏ ఝలక్

హైదరాబాద్: కిడ్నీల్లో రాళ్లున్నాయా.. ఈ మందు తీసుకుంటే రాళ్లన్నీ మటుమాయం.. మధుమేహంతో బాధపడుతున్నారా.. ఈ గోలీలు వేసుకుంటే తగ్గిపోతుంది.. ఈ లేహ్యం తీసుకుంటే క్యాన్సర్ పూర్తిగా తగ్గిపోతుంది.. ఇలా రకరకాల ప్రకటనలతో రోగులను తప్పుతోవ పట్టిస్తున్న అక్రమార్కులకు ఔషధ నియంత్రణ శాఖ (డీసీఏ) ఝలక్ ఇచ్చింది. ఇలాంటి తప్పుడు ప్రకటనలిస్తున్న వారిపై 176 కేసులు నమోదు చేసింది. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారి ఆటకట్టించింది. ఇవేకాకుండా పలు రకాల అంశాలకు సంబంధించి మొత్తం 494 కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం దాడులు జరిపింది. వివరాలను ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న



మందుల విలువ రూ.3.06 కోట్లు ఉంటుందన్నారు. చాలామంది డీసీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొందరు ఆర్‌ఎంపీల పేరుతో వైద్య సేవలు అందిస్తూ మందుల నిల్వలు పెట్టుకుంటున్నారు. కొందరైతే అనుమతులు లేకుండానే మందులను సైతం తయారు చేసి అడ్డదారుల్లో సరఫరా చేస్తున్నట్లు డీసీఏ గుర్తించింది.

ప్రధాన కేసుల సంఖ్య..

నకిలీ మందుల విక్రయాలు-8
అధిక ధరలకు అమ్మకాలు- 75
మందులపై తప్పుడు ప్రకటనలు- 176
అనుమతుల్లేకుండా విక్రయాలు-61
మందుల అక్రమ నిల్వ- 124
అనుమతులు లేకుండా మందుల తయారీ- 41
లైసెన్స్ లేకుండా కాస్మోటిక్స్ తయారీ- 5
ఇతర కేసులు- 4

## ఉపాధికి వస్తే.. ఊపిరి పాయె

చేవెళ్ల : రైల్వే ఉద్యోగ నియామక పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తూ కుటుంబానికి తోడుగా ఉంటున్న వారొకరు.. పొలంలో కూరగాయల్ని విక్రయించి కుటుంబాన్ని పోషించేవారు మరొకరు. కూరగాయల్ని కొనుగోలు చేద్దామని ఆగినవారు ఇంకొకరు.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. రెప్పపాటులో జరిగిన ప్రమాదం ఈ నలుగుర్నీ బలితీసుకుంది. 4 కుటుంబాలకు శోకాన్ని మిగిల్చింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజ్ దగ్గర సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులు విలపించడం అందర్నీ కంటతడి పెట్టించింది. మృతుల వివరాలివీ..!

దామెరగడ్డ కృష్ణ: ఆలూరుకి చెందిన దామెరగడ్డ కృష్ణ ఐటీఐ పూర్తి చేసి రైల్వే నియామక పరీక్ష రాశాడు. ఫలితం కోసం ఎదురుచూస్తున్నాడు. టమాటా బాక్సులు తీసుకెళ్లేందుకు వచ్చి.. ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నక్కలపల్లి రాములు: ఆలూరుకి చెందిన రాములు రైతు. తన పొలంలో పండించిన కూరగాయల్ని విక్రయిస్తుంటాడు. ఇదే లారీ ప్రమాదంలో దుర్మరణంపాలయ్యాడు. శ్యామల సుజాత: నాంచేరుకి చెందిన సుజాత ఆలూరు రోడ్డు పక్కనే ఉండే తన పొలంలో దిగుబడులను విక్రయిస్తుంది. ఈ ఘటనలో ఆమె మరణించింది. జమీల్: రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంకు చెందిన జమీల్.. ఉపాధి కోసం టోలీచౌకి వచ్చాడు. బేకరీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆలూరులో స్నేహితుల్ని కలిసేందుకు వచ్చిన సమయంలో ప్రమాదం జరగడంతో కన్నుమూశాడు.

# మూడు డివిజన్లు .. ముడి పడేనా!



కరీంనగర్ : జిల్లాలోని అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నిర్ణయంతో మెట్టప్రాంతమైన జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్లంపల్లి ఎత్తిపోతలు, కాళేశ్వరం-9వ ప్యాకేజీ పనులకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. వాటి పరిధిలో భూసేకరణ, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. వచ్చే వానాకాలం నాటికి అన్నీ పూర్తి చేసి కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంత వరకు బాగానే ఉన్నా జిల్లాలోని నీటిపారుదలశాఖ మూడు డివిజన్లలో ఎవరి దారి వారిదే అన్న తీరున ఉన్నాయి. ఇవి ముడిపడితేనే పనులన్నీ గట్టెక్కే అవకాశాలున్నాయి.

**రూ.100 కోట్ల పనులు ఎలా...**

నీటిపారుదలశాఖను 2021లో పునర్‌వ్యవస్థీకరించి అందులో చిన్న, మధ్య తరహా జలాశయాలు, ఎత్తిపోతల పథకాలన్నింటినీ ఒకే డివిజన్‌లోకి తీసుకొచ్చారు. జిల్లాను కరీంనగర్ ఈఎన్‌సీ పరిధిలోకి తీసుకొచ్చారు. అదేవిధంగా జిల్లాను 6, 7, 8 డివిజన్లుగా ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారిని నియమించారు. డివిజన్‌కో అధికారిని నియమిస్తే బాగుండేది. అలా చేయలేదు. 6వ డివిజన్ పరిధిలో వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్ నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. దీనిలోకి శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం వస్తుంది. ఇవన్నీ జగిత్యాల సీఈ పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో ఉన్న బోయినపల్లి మండలాన్ని దిగువమానేరు ఈఈ పరిధిలోకి, ఇల్లంతకుంట మండలాన్ని మధ్యమానేరు ఈఈ పరిధిలోకి తీసుకొచ్చారు.

7వ డివిజన్‌లోకి తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు వస్తాయి. ఈ డివిజన్ కార్యాలయం కలెక్టరేట్‌లో ఉంది. ఇది కరీంనగర్ సీఈ, ఈఎన్‌సీ పరిధిలోకి వస్తుంది. అలాగే 8వ డివిజన్‌లో సిరిసిల్ల, కోనరావుపేట, వేములవాడ అర్బన్, రూరల్, వీర్నపల్లి మండలాలు ఉన్నాయి. ఇందులోనే కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఉంది. నియోజకవర్గాన్ని గానీ, రెవెన్యూ డివిజన్‌ను గానీ ఒక పరిధిగా తీసుకోకుండా ఇష్టానుసారంగా చేశారు. దీంతో పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. మరోవైపు రైతులకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నలుగురు ఈఈలు చూసుకోవాల్సిన జిల్లాలో ఇద్దరు మాత్రమే ఉన్నారు.

కాళేశ్వరం 9వ ప్యాకేజీలో అసంపూర్తి పనులకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. దీంతోపాటు కాళేశ్వరం 11, 12 ప్యాకేజీల్లో కాల్వల నిర్మాణాలు డివిజన్ 8 పరిధిలో ఉన్నాయి. ఈ డివిజన్ చూసుకునే ఈఈనే జిల్లా ఇరిగేషన్ అధికారి బాధ్యతలు కూడా చూస్తున్నారు. జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న నీటిపారుదలశాఖను సరిచేస్తేనే ప్రభుత్వం తలపెట్టిన అసంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణాలు సకాలంలో పూర్తవుతాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.వేములవాడ నియోజకవర్గంలో ఎల్లంపల్లి స్టేజ్-2, ఫేజ్-1లో అసంపూర్తి నిర్మాణాలకు ప్రభుత్వం కొత్త కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, సూరమ్మ చెరువు నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లను మంజూరు చేసింది. పైగా వీరు కేవలం ఎల్లంపల్లి పనులకు మాత్రమే పరిమితం. డివిజన్ 6లో చేపట్టే పనులన్నీ జగిత్యాల సీఈ పరిధిలోకి వస్తాయి. ఈ డివిజన్ వారు ఎల్లంపల్లి పనులకు మాత్రమే పరిమితం. ఎత్తిపోతల పథకం పరిధిలోని 15 చెరువులు, కాల్వల నిర్వహణ అంతా డివిజన్-7 వాళ్లే చూసుకోవాలి. దీంతోపాటు ఇటు సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎగువమానేరు కింద 26 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 433 చెరువుల చెరువుల నిర్వహణ కూడా ఈ డివిజన్ వాళ్లే చూసుకోవాలి. అంతే కాకుండా ప్రస్తుతం రూ.35 లక్షలతో చెరువుల ఆపరేషన్స్, నిర్వహణ పనులు జరుగుతున్నాయి.

# వినియోగదారులూ తస్మాత్ జాగ్రత్త!



కరీంనగర్ : పెద్దపల్లిలో వినియోగదారుడు ఇటీవల ఓ దుకాణంలో తినుబండారాలు కొనుగోలు చేశారు. దానిపై ధర, ఇతర వివరాలు లేవు. దీనిపై ఆయన దుకాణ యజమానిని నిలదీస్తే.. ఇష్టముంటే కొనండి.. లేకుంటే లేదని సమాధానమిచ్చారు. కరీంనగర్‌లో ఓ ఉద్యోగి పాల ప్యాకెటు కొనుగోలు చేశాడు. దానిపై ఎలాంటి వివరాలు ముద్రించి లేవు.జగిత్యాలలో ఓ వ్యక్తి బుక్‌స్టాల్‌లో నానోటేప్ కొనుగోలు చేశారు. ప్యాకింగ్‌పై ఎలాంటి వివరాలు లేవు. కనీసం ఎమ్మార్పీ కూడా ముద్రించి లేదు. దుకాణ యజమాని ఎంత అడిగితే అంత ఇవ్వాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, తెలంగాణచౌక్ : ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని పలు సంస్థలు, వ్యక్తులు రకరకాల తినుబండారాలు, వస్తువులను విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. మోసాలకు తెర తీస్తున్నారు. తూకం, కొలతల్లో తేడాలు, చిరునామా, గడువు, తయారీ ప్రాంతం తదితర వివరాలు లేకుండానే ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. ఎలాంటి ముద్రణలేని వస్తువుల ప్యాకింగ్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ప్యాకెట్లపై ఏయే వివరాలు ఉండాలి, మార్కెట్లో ఏం జరుగుతోంది. తదితర వివరాలతో 'న్యూస్‌టుడే కథనం.

**ఏం జరుగుతుందంటే..**

చాలా చోట్ల ప్యాకెట్లపై వివరాలు ముద్రించడంలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో తినుబండారాలు తయారు చేస్తూ వాటిని ప్యాకింగ్ రూపంలో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తున్నారు. నాణ్యత లేనివి తయారు చేయడంతోపాటు వాటిపై ఎలాంటి వివరాలు ఉండటంలేదు.

గడువు తేదీ లేకపోవడంతో అందులో వస్తువులు చెడిపోతుంటాయి. వాటిని తిన్నప్పుడు అనారోగ్య పాలయ్యే ప్రమాదముంది.

ఎలాంటి ప్రాంతంలో తయారు చేస్తున్నారు. ఏయే వస్తువులు కలిపారు. దాని ధర ఎంత అనే వివరాలు తెలియడంలేదు.

విక్రయాలపై తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ నుంచి అనుమతులు పొంది ఉండాలి. ప్యాకింగ్‌పై ముద్రించే లోగో, ఇతర వివరాలను సంబంధిత శాఖకు ఇవ్వాలి. కానీ జరగడం లేదు.

**ఇవి గమనించండి..**

ఏ ఆహార పదార్థాలు అయినా ప్యాకింగ్ చేసి విక్రయిస్తే దానిపై తప్పనిసరిగా పూర్తి వివరాలు నమోదు చేయాలి. సంస్థ పేరు, చిరునామా, పిన్‌కోడ్, వస్తువు పరిమాణం, అందులో కలిపిన వివరాలు, అమ్మకం ధర, తయారీ తేదీ, గడువు, చరవాణి నంబర్, కస్టమర్ కేర్ వివరాలను తప్పనిసరిగా ప్యాకెట్‌పై ముద్రించాలి. ఆ వివరాలు ప్యాక్‌పై ఉన్నాయో లేదా చూడాలి. అలాంటి వివరాలు లేకపోతే కొనకపోవడం మంచిది.

పదార్థాలు గడువులోగా చెడిపోతే కస్టమర్ కేర్‌కు ఫోను చేసి అడగటానికి వీలుంటుంది.

ప్యాక్‌లో ఏది ఎంత మోతాదులో ఉందో ముద్రించారా, లేదా పరిశీలించాలి. వివరాలు లేకుంటే తూనికల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ప్యాకింగ్‌పై చెరిపివేతలు, పాత వివరాలపై స్టిక్కర్లు అతికించడంలాంటివి చేశారమో పరిశీలించండి. గ్రాము నుంచి కిలో వరకు ఎంత ధర పలుకుతుందో దానిపై ముద్రించి ఉండాలి. ఫిర్యాదు చేయండి ప్యాకింగ్ చేసి విక్రయించే వారు నిబంధనలు పాటించాలి. కొనుగోలుదారులకు అర్థమయ్యే విధంగా వివరాలు ముద్రించాలి. ధర, గడువు తేదీ ఇలా ప్రతి అంశం తెలియజేయాలి. అలా చేయకున్నా, ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించినా వినియోగదారులు ఫిర్యాదు చేయాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే నేరుగా మా కార్యాలయంలోగానీ %clm-ts@nic.in% -లో గానీ ఫిర్యాదు చేయొచ్చు. విజయసారథి, తూనికల, కొలతల శాఖ సహాయ నియంత్రణాధికారి

# సర్వే సమాప్తం.. ఆన్‌లైన్ వేగవంతం



పెద్దపల్లి : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర సర్వే పూర్తయింది. కొన్నిరోజులుగా గణకులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. బంధువుల ఇళ్లకు తాళం, వలస వెళ్లిన వారి కారణాలు తెలుసుకుంటూ మరోసారి సందర్శించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను మండల కార్యాలయాల్లో కంప్యూటరీకరణ కొనసాగుతోంది. స్థానిక సిబ్బందితోపాటు అవసరమైన చోట్ల ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించి నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,01,054 ఇళ్ల వివరాలు నమోదు చేయగా 80.78 శాతం నమోదైంది.

**జిల్లాలో తేలిన కుటుంబాలు**

జిల్లాలో రామగుండం నగరపాలిక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికలు, 267 గ్రామ పంచాయతీల్లో సమగ్ర ఇంటింటి సర్వేలో కుటుంబాల సంఖ్య తేలింది. జిల్లాలో కుటుంబాల సంఖ్య పెరిగింది. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,65,484, పట్టణాల్లో 83,500 కలుపుకొని మొత్తం 2,48,984 కుటుంబాలు ఉన్నాయి. గ్రామీణంలో కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఇళ్లకు తాళం వేయడంతో సర్వే ఇబ్బందిగా మారింది. కొన్నిచోట్ల తాళం వేసిన ఇళ్ల బంధువులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రాథమికంగా సమాచారాన్ని సేకరించారు.

**సభ్యులు ఎక్కువ ఉంటే అరగంట**

కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన వారికి ఆపరేటర్ బాధ్యతలు ఇచ్చారు. గణకులు చేసిన ఫారాలను ఆన్‌లైన్ ప్రక్రియలో వేగం పెంచుతున్నారు. ఒక్కో కుటుంబానికి కనీసం 15-20 నిమిషాలు ఉండగా సభ్యులు ఎక్కువగా ఉంటే అరగంట వరకు పడుతుంది. మొదట్లో ఆన్‌లైన్ చేయడంలో కొంత సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ప్రతి ఫారానికి నమోదు చేయాలంటే ఓటీపీ అవసరం. అయితే సాంకేతిక సమస్యతో కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో అనేక పొరపాట్లు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం తప్పులు లేకుండా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

## నిబంధనల పక్కా అమలు.. ఆదాయం కుదేలు

గోదావరిఖని : స్థిరాస్తి వ్యాపారం పెద్దఎత్తున సాగే ఉమ్మడి జిల్లాలో కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోతున్నాయి.. ఇటీవల హైదరాబాద్‌లో హైడ్రా ద్వారా జలాశయాల ఎఫ్‌టీఎల్‌ల పరిధిలోని నిర్మాణాలను కూల్చివేయడం.. బఫర్ జోన్‌లు, ముంపు ప్రాంతాల్లో ఉన్న భూముల్లో నిర్మాణాలకు అనుమతించకపోవడం ఇక్కడి స్థిరాస్తి వ్యాపారంపై ప్రభావం చూపుతోంది.. మరోవైపు ప్రభుత్వం జీవో 257 నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొనడంతో రిజిస్ట్రేషన్లు తగ్గడానికి కారణమయ్యింది.. ఈ క్రమంలో ఆదాయం బాగా తగ్గిపోయింది..హైదరాబాద్ మహా నగరం పరిధిలోని జలాశయాల పరిరక్షణపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఏర్పాటు చేసింది. ఈ సంస్థ జలాశయాల ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటి సామర్థ్యం) పరిధిలో ఉన్న నిర్మాణాలను కూల్చివేయడం.. మరికొన్నింటికి నోటీసులు ఇవ్వడంతో జిల్లాల్లోనూ భయం మొదలైంది. హైడ్రా కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి నాలుగు జిల్లాల్లోనూ జనం స్థలాలు కొనుగోలు చేసేందుకు వెనుకాముందాడుతున్నారు. లేఅవుట్ అనుమతులు ఉన్నా యా.. జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధి.. బఫర్ జోన్‌లో ఈ స్థలం



ఉందా అనేది ఒకటికి రెండుసార్లు సరి చూసుకునే కొనుగోలు చేస్తున్నారు. దీని ప్రభావం ప్లాట్ల విక్రయాలపై పడింది.

**జీవో అమలుతో..**

గతంలోనే ప్రభుత్వం జీవో 257 తీసుకు వచ్చినా అధికారులు అందులో నిబంధనలపై పట్టింపుతో వ్యవహరించేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేయడంతో రిజిస్ట్రేషన్‌ల విషయంలో అధికారులు జీవోలో పేర్కొన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

ఆమోదం పొందిన లేఅవుట్‌లోని స్థలం అయి ఉండాలి.

నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) మార్పు జరగాలి.

లింకు డాక్యుమెంట్లు సరిగా ఉండాలి.

ఎల్‌ఆర్‌ఎస్ (భూమి క్రమబద్ధీకరణ) అయి ఉండాలి. 2017, 2020లలో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించినా ఇప్పటికి నిర్ణయం తీసుకోలేదు.

కచ్చితత్వంతో..ప్రభుత్వం నిబంధనలు కచ్చితంగా పాటించాలన్న ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఎలాంటి పొరపాటు ఉన్నా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌లు చేయకుండా పక్కన పెడుతున్నారు. 257 జీవోకు అనుగుణంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. బఫర్ జోన్‌లు, ముంపు ప్రాంతాల్లో ఉన్న వాటి విషయంలోనూ పూర్తి వివరాలు పరిశీలిస్తున్నారు.

**30 శాతానికి పడిపోయిన రాబడి**

రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోవడంతో ఆ శాఖకు ఆదాయం కూడా పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో 14 రిజిస్ట్రేషన్ కేంద్రాలున్నాయి. వీటిలో జులై నుంచి ఆదాయం పడిపోతూ వచ్చింది. నవంబరు నాటికి 30 శాతం ఆదాయం తగ్గిపోయింది. రామగుండం సబ్ రిజిస్ట్రార్ తిరుపతి మాట్లాడుతూ నిబంధనలు కచ్చితంగా పాటించడం, హైడ్రా ప్రభావం రిజిస్ట్రేషన్లు తగ్గడానికి కారణమవుతున్నాయన్నారు. జీవో 257 నిబంధనల వల్ల చాలా డాక్యుమెంట్లు పక్కన పెడుతున్నామని చెప్పారు.

## నిర్మాణపు లోగుట్టు.. నిధుల కని'కట్టు'!

కరీంనగర్ : ఇది.. కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లోని ముదిరాజ్ సంఘ భవన్న. బహుళ అంతస్తుల్లో నిర్మించాలనుకున్న దీనికి ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలను కేటాయిస్తూ 2022 జులై 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నిర్మాణానికి సాంకేతిక అనుమతులు వచ్చాయి. కానీ సదరు గుత్తేదారు ఇక్కడ ఒక్క ఇటుక పెట్టకుండా.. సిమెంట్, ఇసుకను కలపకుండా.. ఈ నిధులను కాజేశారని సంఘం సభ్యులంతా ఆధారాలతో కార్పొరేషన్ ఉన్నతాధికారులతోపాటు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గుత్తేదారుతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం, నిర్లక్ష్యం ఈ బిల్లు చెల్లింపు విషయంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అధికారులు కనీస నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే బిల్లులను అందజేసినట్లు పక్కాగా అర్థమవుతోంది. ఒకవేళ గుత్తేదారు అధికారుల కళ్లుగప్పే ప్రయత్నం చేసినా.. చాకచక్యంగా వ్యవహరించాల్సిన సంబంధిత విభాగం కళ్లు మూసుకుని పని చేసిందా..? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ అడపాదడపా బల్దియాలో పనిచేసే కొందరి పనితీరు సరిగ్గా ఉండదనే ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమ వసూళ్లతోపాటు కమీషన్లు ఇతరత్రా అభియోగాలను కొందరు ఎదుర్కొన్నారు. తాజాగా అసలు చేయని పనికి ఇంతమొత్తాన్ని అప్పనంగా ఎలా చెల్లించారని ఉన్నతాధికారులు విస్మయానికి గురవుతున్నారు. మరోవైపు ముదిరాజ్ సంఘ్ను స్థానంలో రికార్డుల్లో పొందుపర్చిన భవనం ఎక్కడిదనేది మరో సమస్యగా మారింది. ఆ నిర్మాణాన్ని పరిశీలిస్తే అందులో ఉన్న గేటు ఆధారంగా ఏదైనా ఇంటి భవనమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.ఈ ఫొటోలో నిర్మాణ భవనాన్ని చూపిస్తూ.. తమ కమ్యూనిటీ భవన నిర్మాణ బిల్లును పొందారని సంఘం సభ్యులు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మంజూరైన నిధులు ఖర్చయినట్లు బల్దియా ఇంజినీరింగ్ అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. 28 ఆగస్టు 2024న ఇందుకు సంబంధించిన బిల్లు రూ.4,51,340 సదరు గుత్తేదారుకు చెల్లించినట్లు కార్పొరేషన్ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. అసలు భవనం వద్ద ఎలాంటి పనులు చేపట్టకుండా నిధులెలా ఇస్తారనేది ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అటు పోలీసు, ఇటు కార్పొరేషన్ ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపడుతున్నారు.

**వెలుగులోకి ఇలా..** కరీంనగర్ బైపాస్ మార్గంలో ముదిరాజ్ సంఘ భవనంతోపాటు అక్కడ వివాహ వేడుకలకు వీలుగా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాలని సంఘం సభ్యులు కొన్నేళ్ల కిందట నిర్ణయించారు. మొదట సభ్యులంతా ఎంతో కొంత చందాలుగా వేసుకొని పునాది, పిల్లర్ల స్థాయి నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం స్థానిక ఎంపీని 2022లో కలిస్తే వెంటనే రూ.5 లక్షలు ఎంపీ నిధుల నుంచి వెచ్చించారు.




## విశాఖలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షో- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

విశాఖపట్నం : అశేష జనవాహిని మధ్య సాగరతీరంలో ప్రధానమంత్రి మోదీ రోడ్షో సాగింది. ఈ రోడ్షోలో ప్రధానితోపాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. విశాఖలోని సిరిపురం జంక్షన్ నుంచి ఆంధ్రాయూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ వరకు సాగిందీ యాత్ర. దారి పొడవున భారీగా తరలి వచ్చిన జనం ముగ్గురు నేతలపై పూలుజల్లి ఘన స్వాగతం పలికారు. విశాఖ నగరం మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ నినాదాలతో దద్దరిల్లింది. ఎన్నికల తర్వాత తొలిసారిగా విశాఖ వచ్చిన మోదీకి కూటమి ప్రభుత్వం ఘన స్వాగం పలికింది. ఈ కార్యక్రమం కోసం ప్రత్యకే కమిటీ వేసి జనాన్ని సమీకరించారు. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. రోడ్డు షో జరిగే ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచే ఆంక్షలు విధించారు. భారీగా ట్రాఫిక్ను మళ్లించారు. రోడ్షో కంటే ముందు ఢిల్లీ నుంచి వచ్చిన ప్రధానమంత్రికి విశాఖలో గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. ఐఎన్ఎస్ డేగాకు ముందే చేరుకున్న ముగ్గురు నేతలు మోదీని ఆహ్వానించారు. అక్కడి నుంచే నేరుగా సిరిపురం చేరుకున్న ప్రధానమంత్రి అక్కడ నుంచి రోడ్షోలో పాల్గొన్నారు. దాదాపు గంటపాటు సాగిందీ రోడ్షో. తర్వాత ఆంధ్రాయూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అక్కడే రూ.2 లక్షల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రైల్వే జోన్, పారిశ్రామిక హబ్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్కు కూడా భూమి పూజ చేశారు. వర్చువల్గా విశాఖ రైల్వే జోన్ ప్రధాన కేంద్రం, పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్, గుంటూరు-బీబీనగర్, గుత్తి-పెండేకల్ రైల్వే లైన్ల డబ్లింగ్ పనులకు భూమిపూజ చేశారు. అదే వేదికపై చిలకలూరిపేట 6 లైన్ల బైపాస్ రోడ్డును జాతికి అంకితం చేశారు. విశాఖ పర్యటన ముగించుకున్న తర్వాత మోదీ భువనేశ్వర్ వెళ్లరు.





## ఏపీలో మరోసారి మద్యం షాపులకు నోటిఫికేషన్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు కోసం నూతన నోటిఫికేషన్ విడుదల చేయబోతుంది. రాష్ట్రంలోని గౌడ, శెట్టి బలిజ, గౌడ్, ఈడిగ, గౌండ్ల, యాత, శ్రీశయన, శెగిడి, గామల్ల వంటి కులాలకు 10 శాతం మద్యం షాపుల లైసెన్సులను రిజర్వు చేయాలని నిర్ణయించారు. మొత్తం 335 మద్యం షాపులను కేటాయించనున్నారు, వీటిలో ఉత్తరాంధ్రలోని సొండి కులస్థులకు నాలుగు షాపులు ఉండనున్నాయి.

ఈ షాపుల రిజర్వేషన్ కోసం ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. జిల్లాల వారీగా ఏ కులానికి ఎన్ని షాపులు కేటాయించాలో ఇప్పటికే నిర్ణయించబడింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం, దరఖాస్తు ప్రక్రియ ఈ నెలాఖరులో ప్రారంభమై, ఫిబ్రవరి మొదటి వారంలో షాపులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రిజర్వు చేయబడిన మద్యం షాపుల కోసం లైసెన్సు రుసుము సగం తగ్గించబడింది. సాధారణ షాపుల కోసం రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకు రుసుము ఉంటే, గీత కార్మికుల షాపులకు రూ.25 లక్షల నుంచి రూ.42.50 లక్షల వరకే ఉంటుంది. ఈ లైసెన్సులు 2026 సెప్టెంబర్ 30 వరకు మాత్రమే అమల్లో ఉంటాయి. దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రాలు జత చేయడం తప్పనిసరి అని సూచించింది. దరఖాస్తు ప్రక్రియలో లాటరీ విధానం ద్వారా షాపులు కేటాయిస్తారు.

ఒక్క వ్యక్తికి ఒక్క షాపు మాత్రమే కేటాయించబడుతుంది. ఒకే వ్యక్తి ఒక్క షాపు లేదా వేర్వేరు షాపులకు ఏకకాలంలో అనేక దరఖాస్తులు చేసుకునే వీలుంది, కానీ ఒకదానికంటే ఎక్కువ లభించిన పక్షంలో మిగతావి రద్దు చేయబడతాయి. ఈ నిర్ణయంతో గీత కార్మికుల జీవితాల్లో ప్రగతి తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మద్యం షాపుల రిజర్వేషన్ ద్వారా వారికే ఆర్థిక మద్దతు అందించడమే కాక, స్థానిక గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.




## ఏపీలో ఇంటర్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలుండవు: ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా

అమరావతి: ఇంటర్ విద్యలో కీలక సంస్కరణలకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన పలు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఇంటర్ విద్యలో సంస్కరణలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. "చాలా ఏళ్లుగా ఇంటర్ విద్యలో సంస్కరణలు జరగలేదు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపడుతున్నాం. సైన్స్, ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తాం. 2024-25 నుంచి పదో తరగతిలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టారు. 2025-26 ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడతాం. దీంతో నీట్, జేఈఈ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సులభమవుతుంది. 15 రాష్ట్రాల్లో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ఇంటర్‌లో ప్రవేశపెట్టారు. సిలబస్ సంస్కరణ, నూతన సబ్జెక్ట్ కాంబినేషన్లకు ప్రతిపాదనలు చేస్తున్నాం. పరీక్షల మార్కుల కేటాయింపు విధానంలో సంస్కరణలు తెస్తాం. ఇందులో భాగంగా ఇంటర్ మొదటి సంవత్సర పబ్లిక్ పరీక్షలు తొలగిస్తాం. ఆయా కళాశాలలు అంతర్గతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తాయి. సీబీఎస్ఈ విధానంలో ముందుకెళ్తాం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలనే బోర్డు నిర్వహిస్తుంది. ఈ నెల 26 లోగా సంస్కరణలపై సలహాలు, సూచనలు పంపాలి. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ప్రతిపాదిత సంస్కరణల వివరాలు ఉంచాం" అని కృతికా శుక్లా తెలిపారు.

## ప్రపంచానికి తలమానికంగా డేటా సిటీ: మంత్రి నారా లోకేశ

విశాఖ: రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇస్తున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖలో డీప్‌టెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క కియా పరిశ్రమ రాయలసీమ ముఖచిత్రాన్నే మార్చిందన్నారు.

డేటా సిటీ ప్రపంచానికి తలమానికంగా రూపుదిద్దుకోనుందని లోకేశ్ పేర్కొన్నారు. డ్రోన్ల టెక్నాలజీని సహాయ కార్యక్రమాల్లోనూ వినియోగిస్తున్నట్లు వివరించారు. రతన్ టాటా మంచి దార్శనికుడని.. దేశ పురోగతి కోసం పరితపించేవారన్నారు.




## చంద్రబాబు, మోదీపై షర్మిల సంచలన వ్యాఖ్యలు

విజయవాడ, జనవరి 8: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఈరోజు (బుధవారం) విశాఖకు రానున్నారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రాజెక్టులకు పీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. దాదాపు రూ.రెండు లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు మోదీ. ఏపీకి మోదీ రాక సందర్భంగా ప్రధాని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పలు విమర్శలు గుప్పించారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంట్, కడప స్టీల్ ప్లాంట్, ఉద్యోగాలు, పోలవరం తదితర అంశాలను ప్రస్తావిస్తూ ఏపీసీసీ చీఫ్ విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. "చంద్రబాబు గారు.. మీరు మోడీ కోసం ఎదురు చూస్తుంటే.. ఆయన ఇచ్చిన వాగ్దానాల కోసం రాష్ట్రం ఎదురు చూస్తోంది" అని అన్నారు. విభజన హామీలపై చేసిన మోసాలపై నిలదీసేందుకు ప్రజానీకం ఎదురు చూస్తోందన్నారు. తిరుపతి వేదికగా చంద్రబాబు సమక్షంలోనే రాష్ట్రానికి 10 ఏళ్లు ప్రత్యేక హోదా అన్నారని గుర్తుచేశారు. కానీ 10 ఏళ్లు కాదు 15 ఏళ్లు కావాలని బాబు అడిగారన్నారు. మాటలు కోటలు దాటాయి తప్పిస్తే.. చేతలకు దిక్కులేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి సంజీవని లాంటి హోదా హామీని అందరూ కలిసి ఆటకెక్కించారని మండిపడ్డారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టలేదని.. పారిశ్రామిక కారిడార్లు స్థాపన జరగలేదని విమర్శించారు. 10 ఏళ్లు దాటినా పోలవరం నుంచి చుక్క నీరు పారలేదన్నారు. కడప స్టీల్ కట్టలేదని... విశాఖ ఉక్కును రక్షించలేదని దుయ్యబట్టారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాల్లో కనీసం లక్ష ఉద్యోగాలు కూడా రాష్ట్రానికి ఇచ్చింది లేదన్నారు. విశాఖకు వస్తున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. విశాఖ వేదికగా ప్రధానితో ప్రత్యేక హోదా ప్రకటన చేయించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. విభజన హామీలపై క్లారిటీ ఇప్పించాలన్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేదని మోదీతో పలికించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.






## కుబేరుల నగరంలో కార్చిచ్చు.. సంపన్నగృహాలు అగ్నికి ఆహుతి

అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే ది పాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి.

దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. "చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు" అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టీన్ క్రాప్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి ఫైర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు.

**ఇళ్లు కోల్పోయిన హాలీవుడ్ స్టార్స్..** హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది.

**స్పందించిన బైడెన్..** అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఫైర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

## అమ్మ భాషను మరిస్తే అమ్మను మరిచినట్టే: వెంకయ్యనాయుడు




రాజానగరం: తెలుగు రాష్ట్రాల్లో పాలన తెలుగులోనే జరగాలని.. ఉత్తర్వులు మాతృభాషలోనే ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడారు. అమ్మ భాషను మరిస్తే అమ్మను మరిచినట్టేనన్నారు. తెలుగులో మాట్లాడని వారు.. తెలుగు నాయకుడు కాదన్నారు. మాతృభాషలో మాట్లాడని వారికి ఓటు వేయొద్దని సూచించారు. "రాష్ట్రం బయట వున్న వారంతా తెలుగు బాగా మాట్లాడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లూ నేర్చుకుంటున్నారు. కానీ.. తెలుగు రాష్ట్రాల్లో కొందరు తెలుగు వారు అమ్మ భాష మాట్లాడటం లేదు. న్యాయస్థానాల్లో మాతృభాష వాడకం పెరగాలి. సినిమాల్లో మాటలు, పాటల్లో తెలుగుదనం ఉండాలి. తెలుగు కోసం పత్రికలు, ప్రసార మాధ్యమాలు కృషి చేస్తున్నాయి. ఎన్టీఆర్, నార్ల వెంకటేశ్వరరావు, రామోజీరావు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మన భాషను ఎవరో కాకుండా మనమే కాపాడుకోవాలి. భాషను ప్రేమించు.. ప్రోత్సహించు.. ఇతరులతో పలికించు నినాదంతో ముందుకెళ్లాలి" అని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

**ఎల్‌కేజీ, యూకేజీ మూసివేయాలి: గరికపాటి....** పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ వ్యవస్థలను మూసివేయాలని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు అన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమమే ఉండాలని చెప్పారు. డిగ్రీ వరకు ప్రథమ భాషగా తెలుగు ఉండాలన్నారు. రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబు ఫోన్ చేసి అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి స్వీకరించాలని కోరారని గరికపాటి తెలిపారు. వ్యవస్థలో కొన్ని మార్పులు చేస్తే ఆ పదవిలో ఎవరూ అవసరం లేదని ఆయనకు చెప్పానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి పోలీసు కస్టడీకి విజయ్‌పాల్.. ఒంగోలుకు తరలింపు



గుంటూరు: మాజీ ఎంపీ, ప్రస్తుత శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడు, విశ్రాంత ఏఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి తీసుకున్నారు. విజయ్‌పాల్‌ను మరోసారి కష్టడీకి అప్పగిస్తూ గుంటూరు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన విజయ్‌పాల్.. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైలులో ఉన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం విజయ్‌పాల్‌ను పోలీసులు ప్రకాశం జిల్లా ఒంగోలుకు తరలిస్తున్నారు. అక్కడ ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేయనున్నారు. 24 గంటల పాటు విజయ్‌పాల్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు. గత నెలలో మూడు రోజులపాటు కస్టడీకి తీసుకున్నప్పుడు ఆయన సహకరించలేదని, మరికొందరు సాక్షుల నుంచి కీలక వాంగ్మూలాలు నమోదు చేసిన నేపథ్యంలో విజయ్‌పాల్‌ను మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బుధవారం నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకు పోలీస్ కస్టడీకి అనుమతించింది.

## వైకుంఠద్వార దర్శనం.. 10రోజుల పాటు అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు: బీఆర్ నాయుడు



తిరుమల: ప్రపంచ వ్యాప్తంగా హిందువులు వైకుంఠ ద్వార దర్శనంపై మాట్లాడుకుంటున్నారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు తితిదే అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఈ నెల 10న ఉదయం 4.30 గంటలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. టోకెన్లు కలిగిన భక్తులకే దర్శనాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్వర్ణరథం ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

అన్ని ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులు(జనవరి 10 నుంచి) రద్దు చేసినట్లు వెల్లడించారు. సామాన్య భక్తుల కోసం సిఫార్సు లేఖల దర్శనం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తిరుపతిలోని టోకెన్ల జారీ కేంద్రాలు ఇప్పటికే భక్తులతో కిక్కిరిసిపోయాయని తెలిపారు.

## ట్రైగర్స్ బ్యూటీ అందాన్ని చూశారా!

సోషల్ మీడియా ముద్దుగుమ్మలకు మంచి ప్లాట్ ఫామ్‌గా నిలుస్తుంది. ముఖ్యంగా హీరోయిన్‌గా ప్రయత్నాలు చేస్తున్న ముద్దుగుమ్మలకు తమ అందాలను చూపించేందుకు, తమ ప్రతిభను చూపించేందుకు మంచి ప్లాట్ ఫామ్‌గా నిలుస్తుంది. ఎంతో మంది ముద్దుగుమ్మలు కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం ద్వారా హీరోయిన్స్‌గా పరిచయం అవుతున్నారు. ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న ఫౌజీ సినిమాలో నటిస్తున్న ముద్దుగుమ్మ సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన విషయం అందరికీ తెల్సిందే. అందుకే చాలా మంది సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా అందాల ఆరబోత చేస్తూ బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నారు. అప్పట్లో మాదిరిగా ఒక్క ఛాన్స్ అంటూ స్టూడియోల చుట్టూ, నిర్మాతల చుట్టూ తిరగకుండా సోషల్ మీడియాలో తమ సత్తా చాటే విధంగా కంటెంట్ పోస్ట్ చేస్తే నిర్మాతలు వెతుక్కుంటూ వస్తారు. అందుకే చాలా మంది కొత్త హీరోయిన్స్, హీరోయిన్‌గా ఛాన్స్‌ల కోసం ఎదురు చూస్తున్న వారు ఇలా అంతా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. స్టార్ హీరోయిన్స్ గురించి ప్రత్యేకంగా



చెప్పనక్కర్లేదు. వారు తమ ఫోటోలతో ఫ్యాన్స్‌లో మరింతగా ఫాలోయింగ్ దక్కించుకుంటున్నారు. నటిగా ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో అడుగు పెడుతున్న ముద్దుగుమ్మ దేవియాని శర్మ. ఆ మధ్య వచ్చిన సేవ్ ది ట్రైగర్స్ అనే కామెడీ వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటిగా కనిపించింది. హీరోయిన్‌గా ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తున్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన బోటింగ్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. సేవ్ ది ట్రైగర్ సినిమాలో చాలా పద్దతిగా కనిపించిన దేవియాని శర్మ సోషల్ మీడియాలో మాత్రం బాలీవుడ్ అందాల హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా తన అందాన్ని చూపిస్తూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోల్లో పొట్టి నెక్కర్ వేసుకుని చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం ఈ ముద్దుగుమ్మకే సాధ్యం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి అందాన్ని మరింతగా సోషల్ మీడియా ద్వారా ఫోటో షూట్స్ రూపంలో చూపిస్తే కచ్చితంగా ముందు ముందు అయినా ఆఫర్లు వరుసగా వస్తాయనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. నటిగా మంచి పేరును తెచ్చుకున్న ఈ అమ్మడు ముందు ముందు యంగ్ స్టార్ హీరోల దృష్టిని ఆకర్షించి సినిమా ఆఫర్లను దక్కించుకుంటుందేమో చూడాలి.

## రేణు దేశాయ్ గ్రీన్ సిగ్నల్.. తుది నిర్ణయం తనయుడిదే!

పవన్ కళ్యాణ్ - రేణు దేశాయ్ ల కుమారుడు అకీరా నందన్ ఎంట్రీ గురించి మెగా అభిమానులు, జనసైనికులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారో తెలిసిందే. అకీరా హీరోయిక్ మెటీరియల్. అందులో ఎలాంటి డౌట్ లేదు. అతడితో పాన్ ఇండియాలో సినిమా తీస్తే అద్భుతమే అవుతుందనే విశ్లేషణలు ఇప్పటికే తెరపైకి వచ్చాయి. కానీ అకీరా ఎంట్రీ ఇంకా కన్ఫమ్ అవ్వలేదు. అతడు ఎప్పుడు ఎంట్రీ ఇస్తాడా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే అకీరా వయసు 20 దాటింది. హీరో అవ్వడానికి ఇదే సరైన సమయం. దీంతో ఓ మీడియా సమావేశంలో అకీరా తల్లి రేణు దేశాయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కుమారుడు ఎంట్రీ కోసం ఓ తల్లిగా తాను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడు వస్తాడు? అన్నది తన చేతుల్లో లేదని కూడా స్పష్టం చేసారు. అది పూర్తిగా తన ఇష్టం మీదనే ఆధారపడి ఉంటుందన్నారు. అయితే



ఇంత వరకూ అకీరా ఎంట్రీ విషయంలో ఓ సస్పెన్స్ ఉండేది. అకీరాకి మ్యూజిక్ అంటే ఆసక్తి. ఈ నేపథ్యంలో సినిమాల్లోకి వచ్చినా మ్యూజిక్ డైరెక్టర్ అవుతాడు తప్ప హీరో ఎలా అవుతాడనే వారు. కానీ ఇప్పుడా సీన్ కనిపించలేదు. మామ్ సైతం హీరోగానే ఎంట్రీ ఇస్తాడని సంకేతాలు ఇచ్చారు. కాబట్టి ఇక నిర్ణయం అకీరా చేతుల్లోనే ఉంది. తండ్రి పవన్ కళ్యాణ్ కూడా ఎంతో కాలం సినిమాల్లో కొనసాగే అవకాశం కూడా లేదు. అతడి దృష్టంతా ప్రజా సేవ మీదనే ఉంది. ఇప్పటికే రాజకీయాల్లోకి వెళ్లిపోయారు. 2029 నాటికి ఆయన పూర్తిగా బిజీ అయిపోతారు. ఈలోగా అకీరా ఎంట్రీ ఇచ్చి సత్తా చాటుకోవాలి. ఎందుకంటే అకీరా అంటే ఇమేజ్ ఉన్నా సొంత ట్యాలెంట్ పైనే పైకి రావాలి. పవన్ సహాకారం పెద్దగా ఉండదు. చిరంజీవి తనయుడు రామ్ చరణ్ ఎదిగినట్లే అకీరా కూడా ఇండస్ట్రీలో ఎదగాల్సి ఉంటుంది. మరీ అకీరా అంతటి సామర్థ్యుడా కాదా? అన్నది కాలా నిర్ణయిస్తుంది.




## సైఫ్ కొడుకుతో శ్రీలీల.. భయపెట్టే ప్లానే..



బాలీవుడ్‌లో ఈ మధ్య ఇబ్రహీం అలీ ఖాన్ పేరు గట్టిగానే వైరల్ అవుతోంది. సైఫ్ అలీ ఖాన్ కుమారుడిగా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టబోతున్న ఇబ్రహీం, రీసెంట్ గా టాలీవుడ్ బ్యూటీ శ్రీలీలతో కలసి ముంబై మ్యాడాక్ ఫిలిమ్స్ ఆఫీస్ వద్ద కనిపించడంతో కొత్త చర్చలకు తెర లేపారు. ఈ ఇద్దరు తమ కాజువల్ లుక్‌తో ముంబై ఫోటోగ్రాఫర్లను తెగ ఎట్రాక్ట్ చేశారు. ప్రత్యేకంగా ఇబ్రహీం ఆకర్షణీయమైన అవుట్‌ఫిట్, శ్రీలీల డెనిమ్ లుక్ అందరినీ ఆకట్టుకున్నాయి.

ఇబ్రహీం అలీ ఖాన్ ఇప్పటికే తన డెబ్యూ చిత్రంపై దృష్టి పెట్టగా, శ్రీలీల కూడా తన బిజీ షెడ్యూల్‌కి మధ్య బాలీవుడ్ ప్రయాణం మొదలుపెట్టే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీలీల ప్రస్తుతం పలు పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఆమె నటించిన 'రాబిన్ హుడ్' సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టుతో పాటు మరో పెద్ద ప్రాజెక్ట్‌లో భాగం కావాలని బాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇతర నటీనటులతో పోల్చితే ఇబ్రహీం, శ్రీలీల కలయిక ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. వీరిద్దరూ త్వరలో ఒక భారీ ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేయబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. స్త్రీ 2తో ఇటీవల మంచి లాభాలను అందుకున్న మ్యాడాక్ ఫిలిమ్స్ ఆఫీస్ వద్ద వీరి కనిపించడంతో కొత్త కథలో కనిపించనున్నట్లు అనిపిస్తుంది. ఈ కొత్త జంట వెండితెరపై ఎలా కనిపించబోతుందో చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ ప్రస్తుతం హారర్ థ్రిల్లర్ కాన్సెప్ట్ లతో కొత్త తరహా సినిమాలను లైన్ లో పెట్టింది. 8 వరకు హారర్ కథలు ఉండడం విశేషం. ముందుగా 2025లో 'థమ', 'శక్తి షాలిని' అనే సినిమాలని తీసుకొని రాబోతున్నారు. 2026లో 'భేడియా 2', 'చాముండ' సినిమాలు రానున్నాయి. ఇక 2027లో 'స్త్రీ 3', 'మహా ముంజ్య', 2028లో 'పెహలా మహాయోధ్', 'దూస్రా మహాయోధ్' సినిమాలని తీసుకురానున్నట్లు క్లారిటీ ఇచ్చారు. అన్ని కూడా హర్రర్ థ్రిల్లర్ జోనర్ లోనే తెరకెక్కబోతున్నాయి. దీంతో శ్రీలీల ఇబ్రహీం ఏ సినిమాలో నటించబోతున్నారు అనేది వేచి చూడాలి. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ వారికి ఈ హర్రర్ ఫ్రాంచైజ్ బాగా వర్క్ అవుట్ అవుతోంది. కాబట్టి ఈ ఇద్దరికి బెస్ట్ హిట్ వచ్చే అవకాశం ఉంటుంది. త్వరలో వీరి ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు శ్రీలీల టాలీవుడ్‌లో పలు విజయాలు సాధించగా, ఇబ్రహీం బాలీవుడ్‌లో తన స్థానాన్ని ఎలా సెట్ చేసుకుంటాడో చూడాలి.

## రీమేక్ తో కాదు...సొంత కథతోనే హిట్ ఇస్తా!




కోలీవుడ్ డైరెక్టర్ హెచ్. వినోథ్ గురించి పరిచయం అవసరం లేదు. ' ఖాకీ', 'వలిమై', 'తునీవు' లాంటి యాక్షన్ చిత్రాలతో కోలీవుడ్ లో తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ ని దక్కించుకున్నాడు. తనదైన స్టైలిష్ యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించడం వినోథ్ ప్రత్యేకత. అలాంటి పేరున్న డైరెక్టర్ 'భగవంత్ కేసరి' చిత్రాన్ని రీమేక్ చేస్తు న్నాడు? అంటే ఎవరైనా నమ్ముతారా? అదీ తలపతి 69వ చిత్రంగా 'భగవంత్ కేసరి' రీమేక్ అంటే జరిగే పనేనా? అంటే అందుకు ఎంత మాత్రం ఛాన్సే ఉండదు. కానీ వినోద్ 'భగవంత్ కేసరి'ని రీమేక్ చేస్తున్నట్లు ఓ ప్రచారం తెరపైకి వచ్చింది. ఇది విని నవ్వుకోవడం తప్ప! సాధ్య పడదన్నది మెజార్టీ వర్గం తాజాగా అభిప్రాయ పడుతోంది. ప్రస్తుతం విజయ్ 69వ చిత్రం ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'భగవంత్ కేసరి' రీమేక్ అనగానే విజయ్ అభిమానుల్లో ఒక్కసారిగా నీరసం అందుకుంది. విజయ్ పొలిటికల్ ఎంట్రీకి ముందు ఇలాంటి సినిమాతో ఉపయోగం ఏంటి? అసలు విజయ్ ఇమేజ్ కి ఆ స్టోరీ సెట్ అవుతుందా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు వినోద్ ఈ ప్రాజెక్ట్ పై ఫుల్ క్లారిటీ ఇచ్చేసారు. 69వ చిత్రం ఏ సినిమాకు అధికారిక రీమేక్ కాదని, పూర్తిగా తన ఒరిజినల్ స్క్రిప్ట్ తో రూపొందుతున్న చిత్రమని ఫుల్ క్లారిటీ ఇచ్చేసారు. అభిమానులెవరు ఎలాంటి డౌట్ పెట్టుకోవద్దని తన మార్క్ చిత్రంగా 69వ సినిమా ఉంటుందని తెలిపారు. దీంతో విజయ్ అభి మానులు సోషల్ మీడియా వేదికగా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వినోద్ ని ఆకాశానికి ఎత్తేస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమా విజయ్ రాజకీయ ప్రయాణానికి ముందు చిరస్మరణీయ వీడ్కోలు చిత్రంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయ్ గత సినిమా 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా వాటిని అందు కోవడంలో విఫలమైన సంగతి తెలిసిందే. దీంతో వినోద్ 69వ చిత్రంతో గొప్ప విజయాన్ని అందించి పొలిటికల్ బరిలోకి దించాలని చూస్తున్నారు.

## పింక్‌లో అందాల రాశి జోరు

తెలుగు ప్రేక్షకులకు ఊహలు గుసగుసలాడే సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. తక్కువ సమయంలోనే మంచి సినిమాల్లో, యంగ్ స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్న ముద్దుగుమ్మ తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషల్లోనూ నటించడం జరిగింది. ఈ మధ్య కాలంలో తెలుగులో కంటే ఎక్కువగా తమిళ్, హిందీ భాషల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. టాలీవుడ్‌లో ఎన్నాళ్లు చేసినా ఆశించిన స్థాయిలో పెద్ద ఆఫర్లు రావడం లేదు. దాంతో బాలీవుడ్ వైపు ఈ అమ్మడు చూస్తుందా అనే టాక్ వినిపిస్తుంది. అందాల రాశి సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేస్తుంది. తాజాగా పిక్ డ్రెస్‌లో తన అందాన్ని చూపించడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నడుము అందం చూపిస్తూ క్లీ వేజ్ షో తో చూపు తిప్పనివ్వని ఈ అమ్మడి ఫోటోలకు మంచి స్పందన దక్కింది. రెగ్యులర్‌గా రాశి ఖన్నా సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను



షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈసారి అంతకు మించి అందంగా ఈ అమ్మడి అందాలు ఉన్నాయంటూ అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నడుము అందం చూపించడం ద్వారా కవ్విస్తున్న రాశి ఖన్నా బాలీవుడ్‌లో మెల్ల మెల్లగా పాతుకు పోయేందుకు ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా షేర్ చేయాల్సిందిగా అభిమానులు కోరుకుంటున్నారు. గత సంవత్సరం బాలీవుడ్ మూవీ యోధతో పాటు తమిళ్ మూవీ అరణ్మయ్ 4 సినిమాలోనూ నటించింది. ఆ సినిమాలో తమన్నాతో సమానంగా అందాల ఆరబోత చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత మరో హిందీ సినిమాతో ఏడాది చివర్లో వచ్చింది. హిందీలో ఇప్పటి వరకు కమర్షియల్‌గా పెద్ద హిట్ పడకున్నా ఈ ఏడాదిలోనూ రెండు మూడు సినిమాలు చేసే అవకాశాలు వచ్చాయి. అందులో ఒకటి రెండు సినిమాలు ఇప్పటికే షూటింగ్ ప్రారంభం అయ్యిందని తెలుస్తోంది. తెలుగులో ఇంతకు ముందు వరుసగా సినిమాలు చేసిన ఈ అమ్మడు ఈ మధ్య కాలంలో కాస్త తక్కువ సినిమాలు చేస్తుంది. టాలీవుడ్‌లో ప్రస్తుతం ఈ అమ్మడు ఒకే ఒక్క సినిమా చేస్తుంది. ఆ సినిమా షూటింగ్ పూర్తి కావడానికి మరికొంత సమయం పడుతుందని తెలుస్తోంది. ఇదే సమయంలో రాశి ఖన్నా తమిళ్‌తో పాటు హిందీలోనూ బిజీగా ఉంది. ముందు ముందు రాశి ఖన్నా నుంచి తెలుగు సినిమాలు వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంతో పోల్చితే రాశి ఖన్నాకు టాలీవుడ్‌లో క్రేజ్ తగ్గింది అనిపిస్తుంది. కానీ బాలీవుడ్‌లో వరుసగా ఒకటి రెండు సినిమాలు సక్సెస్ అయితే కచ్చితంగా రాశి ఖన్నాను మళ్లీ తెలుగు ఫిల్మ్ మేకర్స్ సంప్రదిస్తారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో రాశి ఖన్నా మళ్లీ బిజీ కావాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు.

## అషు రెడ్డి ట్రెండీ డ్రెస్సులో హీటెక్కించేలా..

అందాల ఆషు రెడ్డి సోషల్ మీడియాలో గత కొంతకాలంగా విపరీతంగా వైరల్ అవుతోంది. రెగ్యులర్ గా ఈ బ్యూటీ తన గ్లామర్ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ గ్లామర్ ఫోటో షూట్ లు బాలీవుడ్ హీరోయిన్స్ రేంజ్ లో చాలా ఎక్స్ట్రీమ్ గా ఉంటాయి. కొత్త కొత్త అవుట్ ఫిట్ లతో అటు మోడ్రన్, ఇటు ట్రెడిషన్ ని కలిపేసి ఆషు రెడ్డి ఫోటోషూట్ లతో కలర్ ఫుల్ గా కనిపిస్తూ వస్తోంది. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో ఆమె ఇన్ స్టాగ్రామ్ లో మెరిసిపోతుంది. సోషల్ మీడియాలో జూనియర్ సమంత అనే బ్రాండ్ తో అందరికి చేరువ అయిన ఆషు రెడ్డి తరువాత 'బిగ్ బాస్' రియాలిటీ షోలో పార్టిసిపేట్ చేసి బాగా పాపులర్ అయ్యింది. ఆరంభంలో బొద్దుగా ఉండే ఈ అమ్మడు తరువాత ఫిట్ నెస్ పైన ఫోకస్ చేసి స్లిమ్ లుక్ లోకి మారిపోయింది. జూనియర్ సమంత అనే ఇమేజ్ కి దూరంగా వచ్చి ఆషు రెడ్డిగానే తనకంటూ బ్రాండ్



క్రియేట్ చేసుకుంది. ఇదే బ్రాండ్ తో ప్రస్తుతం ఇన్ స్టాగ్రామ్ ని షేక్ చేస్తోంది. ఈమె ఫోటోలని లక్షల్లో నెటిజన్లు రెగ్యులర్ గా వీక్షిస్తున్నారు. ట్విట్టర్ లో కూడా ఆషు రెడ్డి గ్లామర్ ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే ఆషు రెడ్డి తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో బ్లాక్ కలర్ నెట్ టాప్ వేసుకొని అదిరిపోయే లుక్స్ తో ఉన్న ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలలో ఆషు చాలా గ్లామర్ గా కనిపిస్తోంది. ఫోటోలకి ఆమె అదిరిపోయే క్యాప్షన్ కూడా ఇచ్చింది. నాకు ఎలాంటి స్టైలిష్ అవసరం లేదు. ఎందుకంటే నేనే ఒక స్టైల్ అంటూ మెన్షన్ చేసింది. ఆమె కాన్ఫిడెంట్ ని ఎస్టాబ్లిష్ చేసే విధంగా ఈ ఫోటోలు వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ ఉండటం విశేషం. ఇదే లుక్ ని మెయింటేన్ చేస్తే కచ్చితంగా టాలీవుడ్ లో ఆషు రెడ్డికి నటిగా అవకాశాలు పెరగడం గ్యారెంటీ అని అనుకుంటున్నారు.



# కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 8: ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏసీబీ విచారణకు న్యాయవాదిని అనుమతించాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. కేటీఆర్ తరపున లాయర్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై తీర్పును సాయంత్రం 4 గంటలకు వెల్లడిస్తామని న్యాయస్థానం తెలిపింది. తీర్పును సాయంత్రానికి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సమయంలో న్యాయవాది సమక్షంలో విచారణకు అనుమతి ఇవ్వలేదని.. ఆడియో, వీడియో రికార్డు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్న విషయాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. ఎంపీ అవినాష్‌రెడ్డి సీబీఐ కేసులో తాము ఇచ్చిన ఆర్డర్ కాపీ చదివారా అని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదిని అనుమతించిన పలు సుప్రీం కోర్టు తీర్పులను కేటీఆర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా.. న్యాయవాదిని విచారణ సందర్భంలో అనుమతి ఇవ్వని పలు తీర్పులను ఏఏజీ రజనీకాంత్ రెడ్డి ప్రస్తావించారు. ఏసీబీ విచారణ సమయంలో కనిపించేంత దూరంలో న్యాయవాది కనిపించేలా విచారణ గదులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. “ఒక రూంలో ఇన్వెస్టిగేషన్.. ఇంకో రూములో అడ్వకేట్ కూర్చుంటే ఏం ప్రాబ్లం.. ఏసీబీలో అలాంటి వసతులు ఉన్నాయా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. న్యాయవాదికి కేటీఆర్ కనిపించేలా విజిబుల్ డిస్టెన్స్‌కు ఏసీబీలో సౌకర్యం ఉందో లేదో చెప్పాలని ఏఏజీకి హైకోర్టు ఆదేశించింది. దీనిపై సాయంత్రం 4 గంటలకు చెబుతామని కోర్టుకు ఏఏజీ తెలిపింది. విచారణ గదిలోకి నిందితుడితో న్యాయవాదిని కలిసి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. కానీ ఇక్కడ కేటీఆర్ గతంలో మాజీ మంత్రి , ప్రస్తుత ఎమ్మెల్యే కాబట్టి.. న్యాయవాదికి కనిపించేలా విచారణ గదిలో ఏర్పాట్లు ఉన్నాయా అని హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించరు కదా అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించే అవసరం లేనప్పుడు.. ఇన్వెస్ట్‌గేషన్ రూమ్‌లో న్యాయవాది ఉండడం ఎందుకు అని ప్రశ్న వేసింది కోర్టు.

ఒక ముగ్గురి న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని కేటీఆర్ న్యాయవాదికి చెప్పిన ధర్మాసనం.. వారిలో ఒకరిని విజుబుల్ డిస్టెన్స్ వరకు మాత్రమే అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. అనంతరం తీర్పును ఈరోజు సాయంత్రం 4 గంటలకు హైకోర్టు వాయిదా వేసింది.




# మద్యం ప్రియులకు షాక్.. కింగ్ ఫిషర్ బీర్లు బంద్..

హైదరాబాద్, జనవరి 08: తెలంగాణలో మద్యం ప్రియులకు షాకింగ్ న్యూస్ ఇది. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు బంద్ కానున్నాయి. ఇందుకు కారణం.. ఆ బీర్ల తయారీ కంపెనీ తీసుకున్న నిర్ణయమే. అవును.. తెలంగాణకు తమ బీర్లను సప్లయ్ చేయబోమంటూ యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తేల్చి చెప్పింది. ఈ మేరకు బుధవారం నాడు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. బీర్ల ధరలను సవరించకపోవడంతో పాటు.. పాత బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో.. తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిచిపోనుంది. సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 30కి ప్రకారం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి తమ బీర్ సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తన లేఖలో పేర్కొంది. టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.. దీని కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. అలాగే.. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాలా బకాయి పడిందని.. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈ కారణంగా టీజీబీసీఎల్‌కి బీర్లను సరఫరా చేయడం సాధ్యం కాదని, ఇక నుంచి బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ తన లేఖలో స్పష్టం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని యూబీఎల్ విజ్ఞప్తి చేసింది.

# ఫిబ్రవరి 12 నుంచి మేడారం జాతర



హైదరాబాద్, జనవరి 8 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 15వరకు మేడారం మినీ జాతర జరగనుందంటూ 2024 అక్టోబర్‌లోనే మేడారం ఆలయ ట్రస్టు షెడ్యూల్‌ను ప్రకటించింది. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారభించాలని మేడారం పూజారుల సంఘం రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులనుకోరింది. కాగా తాజాగా ఈ జాతర ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష చేపట్టారు. భక్తులకు సౌకర్యాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ మీటింగ్ కు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఇతర అధికారులు హాజరయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి సీతక్క, అధికారులను ఆదేశించారు.

మేడారం పూజారుల ప్రకారం, నాలుగు రోజులపాటు జరగనున్న ఈ జాతరలో భాగంగా.. ఫిబ్రవరి 12న ఆలయ శుద్ధి, పూజలు, గ్రామ నిర్బంధంతో సహ ఆచారాలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13 న, సమ్మక్క - సారలమ్మ దేవతలను పసుపు, కుంకుమలతో పూజిస్తారు. ఫిబ్రవరి 14, 15న మండమెలిగే కార్యక్రమం జరగనుంది. రాష్ట్రప్రభుత్వం రెండేళ్లకు ఒకసారి మేడారం జాతరను నిర్వహిస్తుండగా.. భక్తుల అభ్యర్థన మేరకు ఇటీవలి కాలంలో మినీ జాతర (మండ మెలిగే)ను నిర్వహిస్తున్నారు. కాకతీయ రాజులకు ఎదురించి పోరాడిన ఆదివాసీ మహిళలు సమ్మక్క, సారక్కలను స్మరించుకునేందుకు ఈ జాతరను నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం తాడ్వాయి మండలంలోని చిన్న మేడారం గ్రామంలో నిర్వహించే సమ్మక్క-సారక్క జాతరకు గిరిజనలతో పాటు, పలు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.తెలంగాణలో జరిగే ఈ అతిపెద్ద జాతరకు రాష్ట్రం నుంచి మాత్రమే కాకుండా మహారాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్ఘఢ్ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వనదేవతలకు బంగారం (బెల్లం) రూపంలో తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆ సమయంలో వనంలో కొలువైన వనదేవతకు జనం మధ్యకు రావడంతో అడవంతా జనసంద్రమవుతుంది. అయితే మహా జాతర నిర్వహించిన మరుసటి సంవత్సరం మినీ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనుంది. మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, రవాణా, భద్రత ఏర్పాట్లతో పాటు పలు ఏర్పాట్లు చేయనుంది.




# తెలంగాణలో ఈ 10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్..?

హైదరాబాద్ : తెలంగాణలో ఈ నెల 10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. బకాయిలు చెల్లించకపోవడమే ఇందుకు కారణంగా తెలిపాయి. తమ సమస్యలు పరిష్కరించక పోతే జనవరి 10 నుంచి వైద్య సేవల్ని నిలిపివేస్తామని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటించాయి. ఈ మేరకు ఆరోగ్యశ్రీ సీఇవోకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించాయి. ఆరోగ్యశ్రీతో పాటు, ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్), జర్నలిస్టు హెల్త్ స్కీమ్ (జేహె చ్ఎస్)లలో కూడా భారీగా బకాయిలు ఉన్నాయని తెలిపాయి.

పెండింగ్ బకాయిల వల్ల ఆస్పత్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ (తానా) పేర్కొంది. ఆర్థిక ఇబ్బందులతో ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించే పరిస్థితి లేదని స్పష్టం చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1000 కోట్లకు పైగానే బకాయిలు ఉన్నాయని తానా చెబుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 9 నెలల బకాయిలు రూ.672 కోట్లు పెండింగ్‌లో ఉండగా కాంగ్రెస్ వచ్చాక అది మరింత పెరిగిందని చెబుతున్నారు. గతంలో మొదట బిల్లులు పెట్టిన వారికే మొదట చెల్లింపు (ఫస్ట్ క్లెయిమ్, ఫస్ట్ పేమెంట్) తరహా పద్ధతి ఉండేదని, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులో మొదట ప్రభుత్వ ఆస్పత్రులకు చెల్లిస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులు చేయకపోవడంతో ఆస్పత్రులు నడిపే పరిస్థితి లేదని తెలంగాణ నెట్వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ చెబుతోంది. ప్రభుత్వం మాత్రం గత వారం కూడా రూ.40 కోట్లు విడుదలైందని, బకాయిలు రూ.400 కోట్లకు మించి ఉండవని చెబుతోంది.

# సోలార్ ప్లాంట్ ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు చేయూత : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్ : సోలార్ విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటులో స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని.. ఇందుకు ఆర్థిక చేయూతను అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా భవన్ లో స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతీ పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్కలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తికి అవసరమైన అంశాన్ని అద్యయనం చేసి ఈనెల 09న నూతన ఇంధన పాలసీ ప్రకటించనున్నామని చెప్పారు.

రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు కనీసం 4వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అవసరమైన పరికరాల కొనుగోలుకు బ్యాంకు రుణాల ద్వారా సంఘాలకు సమకూర్చేలా అధికారులు, బ్యాంకర్లు చొరువ తీసుకోవాలన్నారు. గ్రామీణాభివృద్ధి మహిళా సాధికారిత, పునరుత్పత్తి ఇంధన వనరుల విస్తరణ లక్ష్యంగా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు.

# 1,045 మంది ఖైదీలకు ఉచిత న్యాయసలహా: జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా



హైదరాబాద్: గతేడాది 41,138 మంది ఖైదీలు జైలులో ఉన్నారని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా అన్నారు. జైళ్ల శాఖ వార్షిక నివేదికను ఆమె విడుదల చేశారు. హత్య కేసుల్లో 2,754 మంది శిక్ష అనుభవిస్తున్నారని చెప్పారు. 1,045 మంది ఖైదీలకు ఉచిత న్యాయ సలహా సేవలు అందించినట్లు చెప్పారు. పోక్సో కేసుల్లో 3,655 మంది పురుషులు, 94 మంది మహిళలు జైళ్లలో ఉన్నట్లు పేర్కొన్నారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్) కేసుల్లో 5,999 మంది పురుషులు, 312 మంది మహిళలు జైళ్లలో ఉన్నారని వివరించారు.

**చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌ను విడుదల చేశాం :** “2024లో కోర్టు విచారణలో 30,153 కేసులున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 483 మందిని జైలు నుంచి విడుదల చేశాం.

303 మందికి పెరోల్ ఇచ్చాం. ఈ-ములాఖత్ ద్వారా ఖైదీల కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడే అవకాశం కల్పించాం. 2,650 మంది ఖైదీలకు నైపుణ్య శిక్షణ ఇప్పి చ్చాం. 12,650 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం. సినీనటుడు అల్లు అర్జున్ విడుదల విషయంలో జైళ్ల శాఖలో ఎలాంటి లోపం లేదు. చట్ట ప్రకారమే ఆయన్ను విడుదల చేశాం” అని డీజీ సౌమ్యా మిశ్రా అన్నారు.

# ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయింది: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదన్నారు. సాధికారత కల్పించడానికి బదులుగా వారిపై దాడుల చేశారని, ఇళ్లను పడగొట్టారని ఆరోపించారు. ఇది పాలన కాదు.. మహిళలపై వ్యవస్థీకృత క్రూరత్వం అని మండిపడ్డారు. “తెలంగాణలో ఏడాది వినాశకరమైన కాంగ్రెస్ పాలనలో అత్యాచార కేసులు 28.94 శాతం, మహిళల హత్యలు 13 శాతం, కిడ్నాప్‌లు 26 శాతం పెరిగాయి. ఆ పార్టీ వాగ్దానం చేసిన భద్రత ఎక్కడ ఉంది? మహిళల ప్రాథమిక గౌరవం కూడా దాడికి గురవుతోంది. కాంగ్రెస్ హయాంలో 10 వేల మంది బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురయ్యారు. కాంగ్రెస్.. దోపిడీదారులు, విధ్వంసకారులు, అబద్ధాల పార్టీగా మారింది” అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఫార్ములా ఈ-రేసు కేసు.. ఏసీబీ విచారణకు హాజరైన అర్వింద్ కుమార్



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. నిధుల బదలాయింపులో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. తన పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ నుంచి ఎఫ్ఈవో(ఫార్ములా-ఈ ఆపరేషన్స్)కు హెచ్ఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బీఎల్ఎన్ రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసినట్లు సమాచారం. అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు బదిలీ చేసినట్లు గతంలో అర్వింద్ కుమార్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. ఆయన వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నేడు రికార్డు చేయనున్నారు.

**ఈడీ ముందుకు బీఎల్ఎన్ రెడ్డి...** మరోవైపు ఫార్ములా-ఈ రేసు కేసులో బీఎల్ఎన్ రెడ్డి ఈడీ విచారణకు హాజరయ్యారు. రేసు జరిగినప్పుడు ఆయన చీఫ్ ఇంజినీర్‌గా ఉన్నారు. రూ.45.71 కోట్లు విదేశీ సంస్థకు బదిలీ చేసిన వ్యవహారంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఏసీబీ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది.

# కేటీఆర్‌పై మరో ఫిర్యాదు..

హైదరాబాద్, జనవరి 08: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్‌పై మరో ఫిర్యాదు ఏసీబీ, ఈడీలకు చేరింది. ఓఆర్ఆర్ టోల్ అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు చేయాలంటూ యుగేందర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ ఫార్ములా రేస్ ఒక్కటే కాదు.. ఓఆర్ఆర్ అక్రమాలపైనా విచారణ జరపాలని కోరారు. సీఎం, సీఎస్, ఈడీలతో పాటు ఏసీబీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఓఆర్ఆర్ చుట్టూ మెయింటెనెన్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతం అంతా హెచ్ఎండీఏ చేస్తుందన్నారు. ఐఆర్బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కైటెక్స్ గార్మెంట్స్ కంపెనీలకు ఓఆర్ఆర్‌కు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి ముప్పై ఏళ్ల పాటు మెయింటెనెన్స్ ఇచ్చారన్నారు. రూ. 25 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్స్ బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చింది కాబట్టే ఓఆర్ఆర్ మెయింటెనెన్స్ ఇచ్చిందని యుగేందర్ గౌడ్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో క్విడ్ ప్రోకో ఇక్కడ చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. హెచ్ఎండీఏ నిధులపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని యుగేందర్ డిమాండ్ చేశారు. నిదుల దుర్వినియోగంలో అధికారుల పాత్రపైనా దర్యాప్తు జరపాలని కోరారు. కాగా, ఓఆర్ఆర్ టోల్ లీజ్ వ్యవహారంపై కేటీఆర్‌తో పాటు కేసీఆర్ పైనా ఈడీ ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్‌పై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎలక్టోరల్ బాండ్స్‌ను స్క్రూటినీ చేసి ప్రభుత్వ కాంట్రాక్టు, పాలసీ నిర్ణయాలపై దర్యాప్తు జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ తన అసలు రంగు బయటపెట్టింది.. హరీశ్‌రావు ఆగ్రహం

ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్) పేరిట 15 వేల కోట్లు ప్రజల ముక్కు పిండి వసూలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ రెండు నాలుకల ధోరణికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పైన నాడు అడ్డగోలుగా విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి రాగానే అసలు రంగు బయటపెట్టిందని విమర్శించారు. “డబ్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎల్ఆర్ఎస్ పేరిట డబ్బులు దండుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మేము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేస్తా”మని గతంలో కాంగ్రెస్ నేతలు మాటలు చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల నుంచి సొమ్మును దండుకునే కార్యక్రమానికి తెర లేపడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ త్వరలో పుంజుకుంటుందని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడం అంటే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే కదా అర్థమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన వల్ల రియల్ ఎస్టేట్ కుదేలైందని మేం ముందు నుంచే చెప్తుంటే బుకాయిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దాడులు చేయడం మానేసి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. దారి తప్పిన పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేయండని సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com